ప్రజాశక్తి

గురువారం 8 ఫిబ్రవరి 2024

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి

అప్పన్న భూముల బొక్కుడు

- 'పంచగ్రామాల' స్థలాలపై స్టేటస్‌కో ఉన్నా ఆగని అక్రమ భవంతులు
- పేదలు షెడ్డు వేస్తే తొలగింపులు
- ఇష్టారాజ్యంగా అధికారుల ఆక్రమణలు
- 30వేలకు పైగా రైతు కుటుంబాలకు తప్పని ఇక్కట్లు!
- ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ పేరుతో భూ దందాల యత్నాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నంలోని సింహాచలం కొండపై గల 'సింహాద్రి అప్పన్న' కొలువుల్లోని అధికారులు భూములను బొక్కే మార్గాల అన్వేషణలో పడ్డారు. 'కంచె' చేను మేసిన చందంగా ఇనాం చట్టం ప్రకారం దేవస్థానం భూములకు కాపలాదారు- రైతులే హక్కుదార్లు, కానీ రైతులను ఆక్రమణదారులుగా అధికారులు ముద్ర వేస్తూ వారిని ఏళ్లతరబడి వేధిస్తున్నారు. మరోవైపు రూ.కోట్ల విలువైన ఇక్కడి భూములు చేజిక్కించుకునే యత్నాలకు అధికారులు దిగుతున్నారు. ఎలాగంటే.. 'పంచగ్రామా'ల్లోని హక్కుదారులైన సుమారు లక్ష మందికి చెందిన వందల ఎకరాలపై 1996లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం సింహాచలం దేవస్థానానికి రైత్వారీ పట్టాలు ఇవ్వడం దేవస్థాన అధికారులకు వరంగా మారింది. పంచగ్రామాల పరిధిలో కొండలు, గెడ్డలు, గుట్టలు, సాగు భూములు ఇలా అన్నిటిపైనా 'దేవస్థానం అధికారులు కర్రపెత్తనం సాగిస్తుండడం వెల్లడవుతోంది.

దేవస్థానానికి లేని హక్కులు సంక్రమణ...

ఏళ్లతరబడి సుమారు 30వేల కుటుంబాలు (లక్ష జనాభా)కు చెందిన 540 ఎకరాల మేర రైతుల భూములు వందల ఏళ్లుగా రైతుల సాగులోనే ఉన్నాయి. దేవస్థానానికి విజయనగరం మహారాజా వారు వందల ఏళ్ల క్రితం భూమి ఇచ్చినట్లు ఎలాంటి పత్రం దేవస్థానం వద్ద లేకపోవడంతో రైతులే హక్కుదారులుగా ఉండేవారు. 1996లో జారీచేసిన జీవోతో అప్పటివరకూ లేని హక్కులు ఈ భూములపై దేవస్థానానికి వచ్చాయి. జీవో రాకముందు వరకూ రైతులు ఇళ్లు పాడైపోతే రిపేర్లు చేసుకున్నారు. కొన్నిచోట్ల పశువులకు షెడ్లు వేసుకున్నారు. 1996 సంవత్సరంలో పెందుర్తి, చినగదిలి తహశీల్దార్లు జారీచేసిన రైత్వారీ పట్టాలతో ఈ ప్రాంత రైతులకు కష్టాలు మొదలయ్యాయి. అంతేకాదు సింహాచల ప్రాంత అభివృద్ధికి ఈ జీవోయే గొడ్డలిపెట్టుగా మారిందని స్థానికులు

మిగతా 2లో..

3 అంతస్థుల్లో దేవస్థానం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి పాలూరి నరసింగరావు నిర్మించిన భవనం

స్థానికుల ఇంటి నిర్మాణాన్ని అడ్డుకోవడంతో ఫిల్లర్ల దశలోనే నిలిచిన ఇల్లు

అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో ఆశాలను అడ్డుకున్న పోలీసులు

ఆశాలపై నిర్బంధం

విజయవాడ వెళ్లకుండా అడ్డగింత

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

ఆశాలపై ప్రభుత్వం అణచివేతకు దిగింది. తమ సమస్యలు చెప్పుకొనే అవకాశం లేకుండా పోలీసులను రంగంలోకి దించింది. గురువారం విజయవాడ చేరుకోకుండా ఎక్కడికక్కడ పోలీసులు అడ్డుకున్నారు. గృహ నిర్బంధం చేశారు. విధులు నిర్వహిస్తున్న సచివాలయాల దగ్గరకు వెళ్లి విజయవాడ వెళ్లొద్దని నోటీసులు అందజేశారు. జిల్లాలో 1400 మందికి పైగా ఆశా వర్కర్లు ఉన్నారు. వీరంతా యూనియన్ పిలుపు మేరకు రైళ్లలో

మిగతా 2లో..

సిఐటియు ఖండన

అనకాపల్లి : విజయవాడలో మహాధర్నా చేయడానికి వెళుతున్న ఆశా కార్యకర్తలను అనకాపల్లి జిల్లాలో ఎక్కడికక్కడ నిర్బంధించి రైలు ఎక్కుతున్న వారిని దించేసి భయభ్రాంతులకు గురిచేస్తున్న ప్రభుత్వ వైఖరిని సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకరరావు, జి.కోటేశ్వరరావు, ఆశా వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శాంతి, వై.పార్వతి, సత్యవతి, రామలక్ష్మి, వరలక్ష్మి ప్రకటన విడుదల చేశారు.

విశాఖ కలెక్టరేట్ : విజయవాడ ధర్నాకు బయలుదేరుతున్న వారిపై నిర్బంధాలు ఆపాలని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ డిమాండ్‌చేశారు. న్యాయమైన సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అరెస్టులు నిర్బంధాన్ని ప్రయోగించడం దుర్మార్గమన్నారు.

రిమాండ్ గిరిజన ఖైదీ మృతి

వార్త మెయిన్‌లో..

పురుగుల మందు తాగి కౌలు రైతు ఆత్మహత్య

వార్త 8లో..

జూ పార్కులో చింపాంజీ మృతి

వార్త మెయిన్‌లో..

భారత నాస్తిక సమాజం వ్యవస్థాపకులు జయగోపాల్ మృతి

వార్త మెయిన్‌లో..

ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో...

పారిశ్రామిక ఒప్పందాల ప్రస్తావన

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో విశాఖలో 2023లో జరిగిన పారిశ్రామిక సదస్సుల్లో ఒప్పందాల గురించి ప్రస్తావించారు. నిర్దిష్టంగా విశాఖ జిల్లా ప్రాజెక్టుల ప్రగతి, నిధుల కేటాయింపులపై ఎలాంటి వివరాలు లేవు. అయితే పారిశ్రామిక ఒప్పందాల్లో భాగంగా ఒబెరాయ్ గ్రూప్, నోవాటల్, మే ఫెయిర్ హోటల్స్, రిసార్ట్స్, హయత్ రిసార్ట్స్ వంటి పెట్టుబడిదారులను ఆకర్షించి 117 అవగాహన ఒప్పందాలను ప్రభుత్వం చేసుకుందని వెల్లడించారు. 51,083 మందికి ఉపాధి అవకాశాలు దొరుకుతాయని, రూ.3685కోట్లతో 17 ప్రాజెక్టులు అమలవుతూ 7290 మందికి ఉపాధి అవకాశాలు లభించాయని వెల్లడించారు. రూ.19లక్షల కోట్లు పెట్టుబడుల్లో సగం కూడా అమల్లోకి రాకపోవడాన్ని ప్రభుత్వం ఈ బడ్జెట్ పత్రాల్లో అంగీకరించినట్టయింది. ప్రాధాన్య ప్రాజెక్టుల్లో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టును ప్రస్తావించారు తప్ప పనులు ఎంత వరకూ వచ్చాయో వెల్లడించలేదు. దీంతో పాటు రామతీర్థసాగర్, వంశధార, నాగావళి లింక్, హిరమండలం రిజర్వాయర్, గొట్టా ఎల్ఐఎస్, తోటపల్లి రిజర్వాయర్, మహేంద్రతనయ ఆఫ్‌సోర్ రిజర్వాయర్, తాండవ ఎల్ఐఎస్ ప్రాజెక్టులను ప్రస్తావించారు.



1 నుంచి ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి-విశాఖపట్నం : జిల్లాలో మార్చి 1 నుంచి 15వ తేదీ వరకు ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ తనిఖీ అధికారి పి.మురళీధర్ బుధవారం తెలిపారు. ఫిబ్రవరి 11 నుంచి 20వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయని పేర్కొన్నారు. విశాఖ జిల్లా వ్యాప్తంగా ప్రథమ సంవత్సరం థియరీ పరీక్షలకు 40,873 మంది విద్యార్థులు, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 41,806 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ప్రాక్టికల్స్‌కు 32,982 మంది ఎంపిసి విద్యార్థులు, 4,945 మంది బైపిసి విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. థియరీ పరీక్షలకు 93 పరీక్షా కేంద్రాలు, ప్రాక్టికల్స్‌కు 150 కేంద్రాలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. థియరీ పరీక్షలు ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ప్రాక్టికల్ పరీక్షలు ఆయా రోజులలో ఉదయం, మధ్యాహ్నం జరుగుతాయని వివరించారు. విద్యార్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థుల సందేహాల

మిగతా 2లో..

అభివృద్ధి పనులకు స్థాయీ సంఘం ఆమోదం

ప్రజాశక్తి-విశాఖపట్నం : నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందని స్థాయి సంఘం చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. జివిఎంసి ప్రధాన కార్యాలయంలో బుధవారం స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్థాయి సంఘంలో 80 అజెండాలతోపాటు 61 టేబుల్ అజెండాలతో కలిపి మొత్తం 141 అంశాలు పొందుపరిచారని, వీటిని స్థాయి సంఘం సభ్యులు చర్చించి ఆమోదించారని తెలిపారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి పలు ప్రాంతాలలో భవన నిర్మాణ వ్యర్థాలు తొలగింపునకు రూ.3.85 లక్షలు, ప్రజా ఆరోగ్య విభాగానికి సంబంధించి పలు వార్డులలో తాత్కాలిక పద్ధతిపై అదనపు పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసేందుకు జెసిబిలతో వ్యర్థాలు కాపులుప్పాడ తరలించేదుకు రూ.3.20 కోట్లు, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి రూ.21.63 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు స్థాయీ సంఘం ఆమోదం తెలిపిందన్నారు. ఈ సమావేశంలో స్థాయీ సంఘం సభ్యులతో పాటు కార్యదర్శి నల్లనయ్య, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవ రెడ్డి, కార్యనిర్వాహక ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్

మొదటి పేజీ తరువాయి..

'అప్పన్న' భూముల బొక్కుడు

వాపోతున్నారు. భూములన్నీ దేవస్థానం గుప్పెట్లోకి వెళ్లిపోవడంతో అమ్మకాలు, కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్లు లేవు. దీంతో ఆర్థికంగా వేల కుటుంబాలు 25ఏళ్లుగా దీనావస్థలో పడ్డాయి. దేవస్థానం వద్ద అప్పటివరకూ ఒక్క పత్రం కూడా లేని పరిస్థితి నుంచి 'పంచగ్రామాల'పై పట్టు బిగించడానికి నాటి ప్రభుత్వ జీవో దోహదపడింది. దీంతో 25ఏళ్లుగా ఒక షెడ్డు సైతం రైతులు వేసుకున్నా దేవస్థాన అధికారులు వచ్చి వాటిని పీకి పందిరేస్తున్నారు. ఇది వీరిని ఏళ్లతరబడి బాధిస్తోన్న సమస్య కాగా ఏ ప్రభుత్వమూ పరిష్కారం చూపడం లేదన్న ఆవేదన ఈ ప్రాంత ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అయితే కోర్టు నుంచి స్టేటస్ కో ఉందని నిర్మాణాలు కూడదంటూ అధికారులు పోలీస్ బలగాలతో వచ్చి మరీ అడ్డుకోవడం ఆనవాయితీగా మారిపోయింది. కోర్టు స్టేటస్ కో అన్నది ఒక్క పంచగ్రామాల రైతులకే కాకుండా దేవస్థానానికీ వర్తిస్తున్నా ఈ ప్రాంతంలో ఇంకా పలువురి అధికారుల కబ్జాలు పెరిగిపోతున్నాయన్న ఆరోపణలు స్థానిక ప్రజల నుంచి వినిపిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి భూ కబ్జా..

రూ.కోట్ల విలువైన భూమిని సింహాచలం కొండ దిగువన దేవస్థానం భూమిలో అంటే పంచగ్రామాల పరిధిలోకొచ్చే బంగారమ్మ గుడి దగ్గర దేవస్థానం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి పాలూరి నరసింగరావు సుమారు 400 గజాల వరకూ ఆక్రమించి 3 అంతస్థుల భవనం నిర్మించారు. ఇతనిపై అనేక ఆరోపణలున్నా సీనియర్ అసిస్టెంట్ నుంచి రెండు ప్రమోషన్లు సూపరింటెండెంట్, ప్రస్తుతం ఎఇఒ స్థానం కల్పించడంపై జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వం ఎలాంటి చర్యా తీసుకోలేదు. ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్‌కు ఫిర్యాదులున్నా అధికారులు కాబట్టి వదిలేశారు. ఇక్కడ గజం స్థలం రూ.లక్షకు పైగా ధర పలుకుతోంది. దేవస్థానం రూల్స్ ప్రకారం కొత్తభవనాలు నిర్మాణం చేయకూడదు. "అధికారులు మాత్రం విలాసవంతమైన భవనాల్లో కులుకుతున్నారు. తాము షెడ్డువేసుకుంటేనే పోలీస్ వ్యానుల్లో వచ్చి పీకేస్తున్న దేవస్థానం అధికారులు తామెలా నిర్మిస్తారంటూ మజ్జి అప్పలనర్సమ్మ అనే మహిళ ప్రజాశక్తి ఎదుట వాపోయింది.

ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ పేరుతో ఆగడాలు...

ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ పేరుతో 1996 నుంచీ ఇప్పటివరకూ రూ.200కోట్లు వరకూ ఈ భూములపై దేవస్థానం ఖర్చుచేస్తూ పంచగ్రామాలైన అడవివరం (సింహాచలం), పురుషోత్తపురం, చీమలాపల్లి, వేపగుంట, వెంకటాపురం గ్రామాల రైతులను భూముల్లో వ్యవసాయానికి, ఏ కష్టం వచ్చినా భూములు అమ్ముకోడానికి వీల్లేకుండా అడ్డుపడుతుండడంతో ఈ ప్రాంతంలో అభివృద్ధి కూడా ఏళ్లతరబడి ఆగిపోయింది. ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్‌లో లీగల్ సూపరింటెండెంట్, ఇద్దరు ఎఇఒలు, ఇద్దరు గుమస్థాలు, పదుల సంఖ్యలో జీపులు, ఇతర వాహనాలు, 22 మంది కమ్యూనిటీ గార్డులు, ఒక స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పోస్టుల ద్వారా రైతులు, ఈ ప్రాంత ప్రజలపైనా దేవస్థానం స్వారీచేస్తోంది. ఎగ్జిక్యూటివ్ అధికారి (ఇఒ) ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. సింహాచలం దేవస్థాన అనువంశిక ధర్మకర్త (ఛైర్మన్) మాజీ కేంద్ర మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు సైతం వేల ఎకరాలను సింహాద్రి అప్పన్నకు తమ పూర్వీకులు ఇచ్చారన్న ఆలోచనతో 'పంచగ్రామాల' సమస్య దేవస్థానం నియంత్రణలో కొనసాగడానికే మక్కువ చూపడం కొనసాగుతోంది.

1 నుంచి ఇంటర్ పరీక్షలు

నివృత్తికి 0891- 2567561 హెల్ప్ లైన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ప్రతి విద్యార్థికీ తప్పనిసరిగా హాల్‌టికెట్ మంజూరు చేయాలని, ప్రాక్టికల్ పరీక్షల కోసం ప్రత్యేక రుసుం వసూలు చేయరాదని, ఎవరైనా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డిఇఒ ఎల్.చంద్రకళ, డిఎంహెచ్ఒ, ఎపిఇపిడిసిఎల్, ఎపిఎస్ ఆర్‌టిసి పోస్టల్, పోలీస్, విద్యాశాఖ, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

ఆశాలపై నిర్బంధం

విజయవాడ వెళ్లడానికి బుధవారం సమాయత్తమవుతుండగా 200 మందికిపైగా పోలీసులు అదుపులోకి తీసుకోవడం, గృహ నిర్బంధం చేశారు. ఆశాల కదలిక గుర్తించిన ప్రభుత్వం విజయవాడ పెద్ద ఎత్తున రాకుండా నిలువరించే పనిని పోలీసులకు అప్పగించింది. సెక్షన్ 149 నోటీసులను ఆశాలకు పోలీసులు జారీ చేశారు. అనకాపల్లి, దువ్వాడ రైల్వేస్టేషన్‌లో పోలీసులు కాపలాకాసి అడ్డుకున్నారు.

కనీస వేతనాలు చెల్లించాలని, సెలవులు, రిటైర్మెంట్ సదుపాయం, గ్రూప్ ఇన్స్యూరెన్స్ సౌకర్యం, సంక్షేమ పథకాలు అమలుచేయాలని, ఆశా నియామకాలు ప్రభుత్వమే చేపట్టాలని, రాజకీయ జోక్యం తొలగించాలని ఎంతోకాలంగా ఆశాలు డిమాండ్ చేస్తున్నారు. పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశాలను కార్మికులుగా గుర్తించాలన్న డిమాండ్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. 62 సంవత్సరాల రిటైర్మెంట్ జిఒ వర్తింప చేయాలని, 10 లక్షల గ్రూప్ ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఎఎన్‌ఎం, జిఎన్‌ఎం ట్రైనింగ్ పొందిన ఆశా వర్కర్లకు ఎఎన్‌ఎం, హెల్త్ సెక్రటరీల, స్టాఫ్ నర్స్ నియామకాలలో వెయిటేజ్ ఇవ్వాలన్న డిమాండ్లపై ఎన్నికల ముందు సానుకూలంగా స్పందించిన జగన్మోహన్‌రెడ్డి తరువాత పరిష్కరించకపోవడంతో ఆందోళనకు దిగారు.

సిఐటియు నాయకునిపై పోలీసు నిఘా

అచ్యుతాపురం : ఆశాల చలో విజయవాడ నేపథ్యంలో సిఐటియు మండల కన్వీనర్ కె.సోమునాయుడును స్వగ్రామమైన భోగాపురంలో ఇంటి వద్ద పోలీస్ జీపు పెట్టి నిఘా ఉంచారు. దీంతో సోమునాయుడు కుటుంబీకులు భయభ్రాంతులకు గురయ్యారు. పోలీసు నిర్బంధాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము తీవ్రంగా ఖండించారు.

చీడికాడ: సిఐటియు నేత దేముడునాయుడు, ఆశ వర్కర్లను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ప్రభుత్వ దుర్మార్గ చర్యను దేవుడునాయుడు ఖండించారు.

నర్సీపట్నం టౌన్: నాతవరం, గొలుగొండ, నర్సీపట్నం, మాకవరపాలెం మండలాల్లో ఆశాలను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఆశ కార్యకర్తలను పోలీసుల నిర్బంధించడాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు ఖండించారు.

నేటి నుంచి జర్నలిస్టుల ఉచిత మెడికల్ టెస్టులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : 2023 సంవత్సరం ప్రెస్ అక్రిడేషన్ పొందిన జర్నలిస్టులకు గత సారి మెడికల్ టెస్టులు నిర్వహించిన వారికి తప్ప, మిగిలిన వారికి జర్నలిస్టు సంఘాల అభ్యర్థన మేరకు జిల్లా కలెక్టర్, సమాచార శాఖ అధికారుల సహకారంతో మెడికల్ టెస్టులు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి ప్రక్రియ ప్రారంభమై 7 రోజులు పాటు కొనసాగుతుందని జర్నలిస్టు సంఘాల ప్రతినిధి పి.సత్యనారాయణ తెలిపారు. రోజుకు 15 నుంచి 20 మంది వరకు నేరుగా డాల్ఫిన్ డయాగ్నసిస్ (జగదాంబ నుంచి కెజిహెచ్ వెళ్లే దారిలో)కు ఏమీ తినకుండా రావాలని పేర్కొన్నారు. అక్కడ ప్రెస్ అక్రిడేషన్ చూపిస్తే రూ.5 వేల విలువ చేసే టెస్టులను ఉచితంగా చేస్తారని వివరించారు. ఈ అవకాశాన్ని జర్నలిస్టులు వినియోగించుకోవాలని కోరారు.

'ఉత్తరాంధ్రలో వెలమలకు 13 అసెంబ్లీ, 3 ఎంపీ సీట్లు ఇవ్వాలి'

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో వెలమ సామాజిక తరగతికి 13 అసెంబ్లీ, 3 పార్లమెంటు స్థానాలులో అన్ని పార్టీలూ సీట్లు ఇవ్వాలని విశాఖపట్నం వెలమ సంక్షేమ సంఘం (సెంట్రల్ ఆర్గనైజేషన్) డిమాండ్ చేసింది. బుధవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో అధ్యక్షుడు చుక్క చినబాబు మాట్లాడుతూ, రాష్ట్రంలో 32 లక్షలు జనాభా ఉన్న వెలమలకు అన్ని పార్టీలూ రాజకీయ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సుమారు 10 లక్షలవరకు వెలమ సామాజిక తరగతి వారు ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో విశాఖ పార్లమెంటు, అనకాపల్లి పార్లమెంటులలో ఒకటి, విశాఖపట్నం అర్బన్ జిల్లాలో రెండు అసెంబ్లీ, అనకాపల్లి జిల్లాలో పెందుర్తి, చోడవరం, మాడుగుల, నర్సీపట్నం నియోజవర్గాలను వెలమ సామాజ వర్గానికి కేటాయించాలని డిమాండ్‌చేశారు. విశాఖపట్నం వెలమ సంక్షేమ సంఘం కమ్యూనిటీ భవనానికి రాష్ట్ర ప్రభుత్వం 75 సెంట్లు భూమిని వేపగుంట దగ్గరలో కేటాయించిందని, దీన్ని జీవో ద్వారా ఇవ్వాలని కోరారు. వెలమ సంక్షేమ సంఘం కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది బండారు రామకృష్ణ, ఆర్గనైజేషన్ సెక్రటరీ మిడతాన బాపు నాయుడు, మాజీ అధ్యక్షులు ఎర్ర సన్యాసినాయుడు, నాయకులు పాశల సూర్యనారాయణ, కూండ్రపు సోమేశ్వరరావు, సిరికి పోతురాజు, మూడెడ్ల తమ్మునాయుడు, సిరికి కొండలరావు, గూనూరు వెంకట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్‌లో అన్నదానం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం ఫిషింగ్ హార్బర్‌లో శ్రీ జటా గంగేశ్వర రాజ్యశ్యామల అమ్మవారి యజ్ఞం, గంగా హారతి సందర్భముగా బుధవారం గంగమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో రాష్ట్ర మర పడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 5 వేల మంది పాల్గొని గంగమ్మ తల్లి ప్రసాదాన్ని స్వీకరించారు. సుమారు 15 రోజులపాటు అందరూ అమ్మవారి శాంతి యజ్ఞం, చివరి రోజు అన్నదాన కార్యక్రమం వరకు కష్టపడి పనిచేసిన అసోసియేషన్ సభ్యులకు, వైసిపి ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డికి, మాజీ ఎంపీ బొత్సా ఝాన్సీకి జానకిరామ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మైలపల్లి లక్ష్మణరావు, కోశాధికారి మైలపల్లి నరసింహులు, ఉపాధ్యక్షులు గుంటూరు దానయ్య, దూడపోలయ్య, పుక్కళ్ల ఈశ్వరరావు, గణగళ్ళ రాజేష్ గణగళ్ళ పోతయ్య పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
I.P. 2/2024

Between:
Surya Scrap Plastics & Waste Watter Bottles Rep. By its Prop. SALIPALLI PRASAD
. . . Petitioner
And:
KINNERA CAPITALS PVT. LTD., & 10 others
. . . Respondents

PUBLIC NOTICE

The public is hereby informed that the above petitioner filed the above I.P.2/2024 on the file of Honourable II Additional Senior Civil Judge, Visakhapatnam on 23-1-2024 and the matter stands posted to 23-02-2024 for hearing. So public is hereby informed that any objections can be raised in the above case before the Honourable Court on 23-2-2024 either in person or through an advocate at 10.30 a.m.
(By the order of the Honourable II Additional Senior Civil Judge Court at Visakhapatnam)
V.V.L. KOTESWARA RAO
Advocate
Opp. District Court,
Visakhapatnam.
Cell: 7386612243.

డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన కంచరపాలెంలోని గవర్నమెంట్ ఐటిఐలో ఉన్న స్కిల్ హబ్స్ ద్వారా నిరుద్యోగ యువతకు డేటా ఎంట్రీ ఆపరేటర్ షార్ట్ టర్మ్ కోర్స్‌లో శిక్షణ ఇస్తున్నామని ప్రిన్సిపల్ జె.శ్రీకాంత్, జిల్లా నైపుణ్యాధికారి సాయికృష్ణ చైతన్య తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై 30 ఏళ్లలోపు యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తిగల అభ్యర్థులు 7981022453ను సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ ఐటిఐలో ఈ నెల 20వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

మహారాజశ్రీ గౌరవ మోటార్ యాక్సిడెంట్స్ క్లయిమ్స్ ట్రిబ్యునల్ (మొదటి అదనపు జిల్లా జడ్జి) వారి కోర్టు ఖమ్మం
MVOP No.334/2023

బిట్వీన్:
1) సడియం భద్రమ్మ
2) సడియం సత్యం
3) సడియం అరవింద్
....క్లయిమ్ పిటీషనర్
మరియు
1) హిమండి కృష్ణ మరియు ఇతరులు
....రెస్పాడెంట్స్

నోటీసు

R1: హిమండి కృష్ణ తండ్రి: నారాయన ప్పాడు వృత్తి: డ్రైవర్ ఆఫ్ ఆయిల్ ట్యాంకర్ బేరింగ్ నెం.AP39TK-2277, నివాసం: ఇం.నెం.45-2-33/1,రామచంద్రానగర్, మసీదు దగ్గర, అక్కాయపాలెం, విశాఖపట్నం, AP.
పైన తెలిపిన క్లయిమ్ పిటీషనర్స్,రెస్పాండెంట్ నెం.1 అయిన మీపైన మోటార్ వాహన ప్రమాద నష్టపరిహారం కొరకు పైన తెలిపిన కోర్టువారి ఎదుట దావా దాఖలు పరిచినారు. ఇట్టి దావాలో మీ హాజరు కొరకు ది.19.02.2024 న వాయిదా ఉన్నది. మీరు స్వయంగా గాని లేక న్యాయవాది ద్వారా గాని ది.19.02.2024 న ఉ॥గం॥ 10.30 ని॥లకు పైన తెలిపిన కోర్టు వారి ఎదుట హాజరుకాగలరు. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
(కోర్టువారి అనుమతితో)
పోట్రు వెంకయ్య చౌదరి
న్యాయవాది,ఖమ్మం.
సెల్:9441121628.

IN THE HONOURABLE COURT OF THE 2nd ADDL.SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
I.P.4/2024

Between:
Donka Yelamaji, W/o. Sankar, Hindu, aged 32 years, R/o. Eguvupeta, Bheemunipatnam
. . . Petitioner
And:
1. Donio Yelamaji
2. Bopni Srinuvasa Rao
3. Palitula Revathi
4. Vasupalli Yellamma
5. Peerupilli Venu
6. Peerupilli Naresh
7. Vasupilli Sattirajulu
. .. Respondents

GENERAL NOTICE

The Public are hereby informed that the above petitioner filed the above I.P.4/2024 on the file of the Hon'ble 2nd Addl.Senior Civil Judge,at Visakhapatnam to declare her as an **INSOLVENT** and also file **I.A.13/2024 in I.P.4/2024** to **PROTECT HER** from the hands of the respondents..and the matter stands posted to 26-02-2024 for hearing. So Public are hereby informed that any objections cane be raised in the above case before the Hon'ble court on **26-02-2024** either in person or through an Advocate at **10.30 A.M.**
(By the order of the Hon'ble 2nd Addl. Senior Civil Judge, at Visakhaptnam)
M.V.PARVATEESAM
Advocate & Notary
11-30-21, Subash Road
Bheemunipatnam 531163
Ph.9849652677

IN THE HONOURALE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT BHEEMUNIPATNAM
I.A. 230/2020 IN O.S.102/19

Between:
Bathula Surya Rao...Petitioner/Plaintiff
And:
Bathula Appanna (Died) and 5 others
. . . Respondents/Defendants
R-5: Bonda Sujatha W/o. Eswara Rao Hindu,aged 33 years, 35-35-4 Gavaraveedhi,Gavarakancharapalem Visakhapatnam Town & Dist.

NOTICE

That the plaintiff BATHULA SURYA RAO filed the above suit O.S.102/2019 for specific performance of the Agreement of Sale Dated. 24-03-2013 against your father and brother While the suit is pending your father died The Petitioner filed the above 1.A.230/2020 for adding of you and other legal representatives of your father .Except you remaining respondents received the notices. So the Hon'ble court ordered for substitute service of notice to you and the above matter stands posted to 06-03-2024 for your appearance and also for counter. So either personally or through your counsel appear before the Honourable Court on **06-03-2024 before 10.30 am** and file your objections if any. Failing which the Honourable Court passed orders against you in a court of law. Hence this notice
By order of the court.
D.KANAKAMAHALAKSHMI
Advocate Lankadavari Veedhi
Bheemunipatnam531163
Cell : 9533187221
Bheemunipatnam
Dated.06-02-2024

IN THE HONOURALE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM
A.S.NO.61/2022

Between:
1. G. Venkata Suryanarayana
2. G. Satyavathi
. . . Appellants
And:
Smt. Nakka Padmavathi
. . . Respondent

PUBLIC NOTICE

To
The Respondent:
Smt. Nakka Padmavathi,
W/o. Narayana Rao, Hindu,
aged about 39years, Residing at Flat No.104, First Ward,
Ramalingeswara Residency,
Near T.I.C Point, Arilova,
Chinagadili Mandalam,
Visakhapatnam.
Please take notice that the above named Appellants filed the above matter against you and the same stands posted on **05-03-2024** at **10:30am** for your appearance, and on that day you are required personally or through advocate to attend before the Hon'ble Court at **10:30 AM** failing which the matter will be heard and determined in your absence as ex-parte as per law.
K.P.NAIDU,
Advocate,
Visakhapatnam.
Cell No.9848633496

IN THE HON'BLE COURT OF THE VII ADDL. DISTRICT & SESSIONS JUDGE cum M.A.C.T. AT: VISAKHAPATNAM
M.O.P.1066/2022

Between:
Munakala Rajeswari & 3 others
...Petitioners
And:
Abburi Nagendra Babu & another
...Respondents

NOTICE

To,
R-1: Abburi Nagendra Babu,
S/o. A. Ramachandra Rao,
Hindu, aged 61 years,
R/at D.No.304-A, Sector-3,
Near Shopping Complex,
Ukkunagaram, Steel Plant,
Visakhapatnam. (Driver of CAR bearing Reg.No.AP 31 AC 1360)
R-2: Abburi Avinash,
S/o. A.Nagendra Babu, Hindu,
aged not known but Major, Rest-do-
(Owner of CAR bearing Reg.No.AP 31 AC 1360)
Please take notice that the above-named petitioners herein has filed the above M.O.P. against both of you for claiming compensation and the matter stands posted to **14-02-2024** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **14-02-2024** at **10:30 A.M**. in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.
(By Order of the Hon'ble Court)
NAMBURI SRINIVASA GANGADHARAM
Advocate
Visakhapatnam,
Cell: 9666658544.

చైతన్య పాఠశాలలో స్పోర్ట్స్ మీట్

క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న అహ్మద్ ఆలీ

ప్రజాశక్తి- పిఎం.పాలెం : మధురవాడ బక్కన్నపాలెం రోడ్‌లోని చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌ను చైతన్య పాఠశాలల రీజినల్ ఇన్‌ఛార్జి అహ్మద్ అలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, చిరుప్రాయంలోనే ఆటల్లో నైపుణ్యం కనబరిస్తే, భవిష్యత్‌లో రాణిస్తారన్నారు. . పాఠశాల ప్రిన్సిపల్ సందీప్ మాట్లాడుతూ ఆటల పోటీలతో విద్యార్థులతో శారీరక, మానసిక స్థైర్యంతోపాటు పోటీతత్వం అలవడుతుందన్నారు. స్పోర్ట్స్‌మీట్‌లో ప్రీప్రైమరీ, ప్రైమరీ విద్యార్థులు పాల్గొనగా, విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. విజేతలను చైతన్య పాఠశాలల ఎజిఎం సురేష్ అభినందించారు. చివరగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విశాఖ జోన్ ప్రీప్రైమరీ ఇన్‌ఛార్జి జ్యోతి, వైస్ ప్రిన్సిపల్ ఉమామహేశ్వరరావు, ప్రీ ప్రైమరీ, ప్రైమరీ ఇన్‌ఛార్జిలు దీప్తి, దుర్గ పాల్గొన్నారు.

కల్యాణ మండపం పనుల పరిశీలన

పనులను పరిశీలిస్తున్న బెహరా భాస్కర రావు

ప్రజాశక్తి -గోపాలపట్నం : జివిఎంసి 92వవార్డు పద్మనాభనగర్‌లో కాపు కల్యాణమండపం నిర్మాణ పనులను బుధవారం జివిఎంసి కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు కాపు సంఘం నేతలతో కలిసి పరిశీలించారు. జివిఎంసి నిధులు రూ.రెండు కోట్లతో ఈ పనులను చేపడుతున్నారు. అదనపు అంతస్తు నిర్మాణానికి సిద్ధంగా ఉన్న పనులను పరిశీలించి, నాణ్యతాప్రమాణాలపై తగు సూచనలు చేశారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కంపర సత్తిబాబు, సాలాపు మారయ్య, కంపర కోటేశ్వరరావు, కంపర రామకష్ణ, ధవళ గోపాల్, కంచిపాటి నాగరాజు, బలిజి అప్పలనాయుడు, సాలాపు ఈశ్వరరావు, వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్య ఉంటేనే విజయం సాధిస్తాం

విద్యార్థులకు పెన్నులు, మెటీరియల్ ఇస్తున్న ఎంపిపి

ప్రజాశక్తి -పద్మనాభం : విద్య ఉంటేనే ఏ రంగంలోనైనా రాణించి, విజయం సాధించడానికి ఆస్కారముంటుందని ఎంపిపి కె.రాంబాబు అన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో టెన్త్, ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గ్రేస్ లిల్లీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంపిపి మాట్లాడుతూ, విద్యారంగానికి ప్రభుత్వం ఇతోధికంగా ప్రోత్సాహాన్ని అందిస్తోందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంఇఒ రమణతో కలిసి, విద్యార్థులకు ఆశీర్వచనాలను అందజేసిన ఎంపిపి, వారికి పరీక్షల మెటీరియల్ పెన్నులను అందజేశారు. స్వర్ణలత ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఆకతాయిల చేష్టలతో అవస్థలు

ఓపెన్ బార్‌గా మారిన లాల్ బహదూర్‌శాస్త్రి పార్కు

మందుబాబుల ఆగడాలతో జనం బేజారు.. పట్టించుకోని జివిఎంసి, పోలీసులు

పార్కులోని బెంచీలపై ఖాళీ మద్యం సీసాలు

పార్కు నిండా చిందర వందరగా మద్యం బాటిళ్లు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 26వ వార్డులోని లాల్ బహదూర్‌శాస్త్రి పార్కులో ఆకతాయిల చేష్టలతో ఈ ప్రాంత ప్రజలు అవస్థలు పడుతున్నారు. చీకటి పడితేచాలు నిర్మానుష్యమైన పార్కును కొంతమంది వ్యక్తులు ఓపెన్ బార్‌గా మార్చేస్తున్నారు. పార్కులోకి చొరబడి మద్యం తాగడంతోపాటు, అటుగా వచ్చిపోయే వాహనదారులు, పాదచారులను, ముఖ్యంగా మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పార్కులోని బెంచీల వద్ద, ఇతరత్రా ప్రాంతాల్లో తాగి పడేసిన మద్యం బాటిళ్లు, వాటిని పగలగొట్టడంతో గాజుపెంకులు, ఇతర వ్యర్థాలతో అధ్వానంగా మార్చేస్తున్నారు. దీంతో పార్కు అపరిశుభ్రమయంగా మారి, తీవ్రమైన దుర్వాసనతో మరుసటి రోజున వచ్చే వృద్ధులు, మహిళలు, పిల్లలు, క్షణమైనా ఉండనీయకుండా చేసే పరిస్థితులు కల్పిస్తున్నారని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

పార్కులో మందుబాబుల ఆగడాలు, ఆకతాయల చేష్టల నియంత్రణకు జివిఎంసి యంత్రాంగం, పోలీసుశాఖ ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో రోజురోజుకూ పెట్రేగిపోతున్నారని స్థానికులు వాపోతు న్నారు. ఇప్పటికైనా పోలీసు యంత్రాంగం స్పందించి, పార్కులో మందుబాబులు వదిలేసిన మద్యం బాటిళ్లు, ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని కోరుతున్నారు. అలాగే మందుబాబుల ఆగడాలకు చెక్ పెట్టి, తగు రక్షణ కల్పించేందుకు పోలీసుశాఖ రక్షణ కల్పించాలని స్థానిక మహిళలు, సీనియర్ సిటిజన్స్ కోరుతున్నారు. రాత్రిపూట గస్తీ, నిఘా పెంచాలని వేడుకుంటున్నారు. దీనిపై నాలుగో పట్టణ సిఐ ఎస్.విజయకుమార్‌ను వివరణ కోరగా, పార్కు ప్రాంతంలో రాత్రి వేళల్లో గస్తీ, ముమ్మర తనిఖీలు నిర్వహించి, మందుబాబులు, ఆకతాయిల ఆగడాల నియంత్రణకు తగు చర్యలు చేపతామన్నారు.

నవోదయ విద్యార్థులు సంయమనం పాటించాలి

విద్యార్థుల గొడవపై ఆరా తీస్తున్న సీతారాం

ప్రజాశక్తి -పిఎం పాలెం: కొమ్మాదిలోని జవహర్ నవోదయ విద్యార్థులు సంయమనం పాటించాలని రాష్ట్ర బాలలహక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం సూచించారు. పాఠశాలలో జూనియర్ విద్యార్థులపై సీనియర్లు దాడి, వేధింపులకు పాల్పడ్డారని పత్రికల్లో వచ్చిన వార్తలపై కమిషన్ సీరియస్‌గా స్పందించింది. ఈ మేరకు బుధవారం కమిషన్ సభ్యులు పాఠశాలకు చేరుకుని ప్రిన్సిపల్ సంజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు. గొడవకు కారణాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ, పాఠశాలల్లో విద్యార్థులు అన్నదమ్ముల్లా మెలగాలని, శాంతియుతంగా విద్యాబోధన సాగించాలన్నారు. గొడవలతో పోలీస్ స్టేషన్లకు వెళితే భవిష్యత్ నాశనమౌతుందన్నారు. ఘటనపై సంబంధిత విద్యాశాఖ అధికారులతోపాటు పోలీసులు దర్యాప్తు నివేదికను కమిషన్‌కు అందించాలని ఆదేశించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. డిప్యూటీ డిఇఒ గౌరీశంకర్, చినగదిలి ఎంఇఒ రవీంద్రబాబు, జిసిడిఒ ఖలీషా బేగం, భీమిలి చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీదేవి పాల్గొన్నారు.

భీమిలిలో మహిళా ఓటర్లే అధికం

ప్రజాశక్తి-భీమునిపట్నం : జిల్లాలో అత్యధిక ఓటర్లున్న భీమిలి అసెంబ్లీ నియోజకవర్గంలో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. నియోజక వర్గంలో మొత్తంగా 3,51,462 మంది ఓటర్లు ఉండగా, ఇందులో వీరిలో 1,78,957 మంది మహిళలు, 1,72,488 మంది పురుషులు, 17 మంది థర్డ్ జెండర్ ఓటర్లున్నారు. పురుషుల కంటే మహిళా ఓటర్లే 6,469 మంది ఎక్కువగా ఉన్నారు.

మండలాల వారీగా పరిశీలిస్తే, 1 నుంచి 45 వరకు పోలింగ్ కేంద్రాలున్న పద్మనాభం మండలం లో మొత్తం ఓటర్లు 41,775 మంది ఉండగా, ఇందులో మహిళలు 21,351 మంది, పురుషులు 20,424 మంది ఉన్నారు. 46 నుంచి 102 వరకు పోలింగ్ కేంద్రాలున్న ఆనందపురం మండలంలో మొత్తం ఓటర్లు 50,703 మంది ఉండగా, ఇందులో మహిళలు 25,652 మంది, పురుషులు 25,051మంది ఉన్నారు 103 నుంచి 207 వరకు పోలింగ్ కేంద్రాలున్న భీమిలి మండలంలో మొత్తం ఓటర్లు 99,890 మంది ఉండగా, ఇందులో మహిళలు 51,187 మంది, పురుషులు 48,700, థర్డ్ జెండర్ ఓటర్లు ముగ్గురు ఉన్నారు. 208 నుంచి 348 వరకు పోలింగ్ కేంద్రాలున్న విశాఖ రూరల్ మండలంలో మొత్తం ఓటర్లు లక్ష 59 వేల 94 మంది ఉండగా, ఇందులో మహిళలు 80,767 మంది, పురుషులు 78, 313 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు14 మంది ఉన్నారు

అనంత పద్మనాభుని కల్యాణోత్సవంపై సమీక్ష

ప్రజాశక్తి-పద్మనాభం : వచ్చేనెల 20 నుంచి 26 వరకు నిర్వహించనున్న అనంతపద్మనాభుని కల్యాణోత్సవంపై స్థానిక ఎంపిపి కె.రాంబాబు ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం కుంతీ మాధవస్వామి ఆలయంలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ, దేవస్థానం తరపున కల్యాణోత్సవానికి సంబంధించి కొన్ని కార్యక్రమాలను నిర్వహిస్తారని, మిగతా కార్యక్రమాల నిర్వహణకు భక్తులు విరాళాల రూపేణా సహకారం అందించాలని కోరారు. ఈ ఏడాది స్వామి కల్యాణోత్సవంతోపాటు తెప్పోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించి, దీనికి సంబంధిం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో భక్తులు బి.సత్యనారాయణ, టి పద్దు, కేరి నాయుడు, జిపివై నాయుడు, ఎస్ నారాయణరావు, ఎం.సన్నిబాబు, టి. పైడిరాజు, కె.గోవింద, కె.నారాయణరావు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఉద్యోగాల పేరుతో మోసం

- ఇద్దరిపై కేసు నమోదు

ప్రజాశక్తి-చోడవరం : ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై చీటింగ్ కేసు నమోదు చేశామని స్థానిక సీఐ బి శ్రీనివాసరావు తెలిపారు. చోడవరం నవుడు వీధికి చెందిన డోకల మోహన్‌రావు అనే వ్యక్తి వద్ద ఉద్యోగం ఇప్పిస్తామని కసిరెడ్డి రమణమూర్తి, ఆయన తమ్ముడు మోహన్ బాబు 2021లో నాలుగు లక్షల రూపాయలు తీసుకున్నారు. ఉద్యోగం రాకపోవడంతో మోహన్ రావు ఇటీవల అనకాపల్లి జిల్లా కలెక్టర్ స్పందనలో ఫిర్యాదు చేయడంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ శ్రీనివాసరావు తెలిపారు. మరి కొంతమంది వ్యక్తులు వద్ద ఉద్యోగాలు ఇప్పిస్తామని ఇరువురు అన్నదమ్ములు డబ్బులు తీసుకున్నట్లు సిఐ తెలిపారు.

115 మద్యం బాటిళ్లు పట్టివేత

ప్రజాశక్తి -అనకాపల్లి: అక్రమంగా రవాణా చేస్తున్న 115 మద్యం బాటిళ్లను సబ్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం స్వాధీనం చేసుకున్నారు. అనకాపల్లి పట్టణం వెంకటేశ్వర థియేటర్ జంక్షన్ వద్ద ప్రభుత్వ మద్యం దుకాణంలో సూపర్వైజర్‌గా పని చేస్తున్న కె.గణేష్ సత్య కీర్తి అక్రమ మద్యం బాటిళ్లు రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. వేరొక మద్యం దుకాణంలో సేల్స్ మెన్ గా పనిచేస్తున్న జస్వంత్ (పరారీలో ఉన్న వ్యక్తి)కు అమ్మే క్రమంలో అనకాపల్లి సెబ్ స్టేషన్ ఇన్స్పెక్టర్ డి.అనిల్ కుమార్, సిబ్బంది అదుపులోనికి తీసుకొని 115 మద్యం బాటిళ్లు (క్వార్టర్ బాటిళ్లు) ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుమారు దీని విలువ రూ.17,500, ఉంటుందని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న సెబ్ పోలీసులు తెలిపారు.

ఆరు లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని కొండపాలెం గ్రామంలో నాటుసారా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేసి ఆరు లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా అమ్మతున్న ముచ్చర్ల రామయ్యమ్మను అరెస్టు చేసినట్లు బుచ్చయ్యపేట ఎస్సై డి ఈశ్వరరావు బుధవారం తెలిపారు. ఆమెపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించినట్లు వెల్లడించారు.

ఎస్‌టియు మండల కార్యవర్గం

ఎస్‌టియు మండల కార్యవర్గం ప్రతినిధులు వీరే

ప్రజాశక్తి -పద్మనాభం: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ అతిథి గృహంలో బుధవారం ఎస్‌టియు మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మండల కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా కె.అక్కులు, అధ్యక్షులుగా వాడపల్లి గణేష్, ప్రధాన కార్యదర్శిగా తాలాడ రామకృష్ణ, సహాధ్యక్షులుగా ఎం.ప్రశాంతి, అదనపు కార్యదర్శిగా పి.రామనాయుడు, ఉపాధ్యక్షులుగా కె.ప్రసాద్, పి.శ్రీనివాసరావు, కార్యదర్శులుగా ఐ వెంకటరాజు, కె.ఆదిబాబు, ఎస్.నాగరాజు, కోశాధికారిగా ఎ.బంగారురావు, జిల్లా కౌన్సిలర్లుగా ఆర్.జగదీష్ బాబు, వి.శంకరరావు, ఎస్ రమేష్, జి.సింహాచలం, టి రామస్వామి, కెటిఎస్.నాయుడు, వి ఆంజనేయులు, పి.లక్ష్మణ రావులను నియమించారు. కార్యక్రమంలో చిరంజీవిరావు, అప్పారావు, రామకృష్ణ పాల్గొన్నారు.

తహశీల్దారుగా శివన్నారాయణ

ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలి (విశాఖ రూరల్) తహశీల్దారుగా ఎన్.శివన్నారాయణ బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా గరివిడి మండలంలో తహశీల్దారుగా బాధ్యతలు నిర్వర్తించి, బదిలీపై వచ్చారు. చినగదిలి తహశీల్దారుగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన శివన్నారాయణకు స్థానిక రెవెన్యూ కార్యాలయం అధికారులు, సిబ్బంది పుష్పగుచ్చాలు ఇచ్చి అభినందించారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

గోస్తనీలో తాగునీటి పైపులైన్‌ను పరిశీలిస్తున్న జెడ్‌పి సిఇఒ

ప్రజాశక్తి -భీమునిపట్నం : రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా నీటి పథకాల నిర్వహణపై జెడ్‌పి సిఇఒ ఎం.పోలినాయుడు సంబంధిత అధికారులకు ఆదేశించారు. బుధవారం మండలంలోని టి నగరపాలెం, దాకమర్రి గ్రామాల్లో పర్యటించారు ఆయా గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలను పరిశీలించి, వాటి నిర్వహణపై సంబంధించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. గోస్తనీలో తాగునీటి పైపులైనును పరిశీలించారు. దాకమర్రిలో జెడ్‌పి హైస్కూల్, సచివాలయాన్ని సందర్శించారు. విద్యార్థులకు, సచివాలయ ఉద్యోగులకు, సిబ్బందికి సూచనలు చేశారు. జెడ్‌పి ఉప ముఖ్య కార్య నిర్వహణాధికారి డి.సత్యనారాయణ, ఎంపిడిఒ డాక్టర్ జానకి, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ దుర్గాంబ, ఎఇఇ సుబ్బలక్ష్మి పాల్గొన్నారు

ఫుట్‌బాల్ పోటీల్లో రన్నరప్‌గా చిట్టివలస జట్టు

రన్నర్స్‌గా నిలిచిన చిట్టివలస ఫుట్‌బాల్ జట్టు క్రీడాకారులు

ప్రజాశక్తి -తగరపువలస : ఒడిషాలోని నిరా కార్పూర్‌లో బుధవారం జరిగిన ఆలిండియా ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఫైనల్స్‌లో చిట్టివలస పోలమాంబ జట్టు రన్నర్స్ గా నిలిచినట్లు క్లబ్ కార్యదర్శి అక్కరమాని చినబాబు తెలిపారు. రన్నరప్ చిట్టివలస పోలమాంబ జట్టుకు ట్రోఫీతోపాటు రూ.15వేలు నగదు బహుమతిని అందజేశారు. అఖిల భారత పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను చినబాబు అభినందించారు.

ఉత్తరాంధ్ర సాధనకు ఆత్మ గౌరవ యాత్ర

ఆత్మగౌరవ యాత్రలో పాల్గొన్న రామారావు, ఆదిబాబు

ప్రజాశక్తి- సీతమ్మధార : ప్రత్యేక ఉత్తరాంధ్ర రాష్ట్రం సాధించాలనే లక్ష్యంతో ఉత్తరాంధ్ర ప్రజాపార్టీ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర ఆత్మగౌరవం పేరుతో యాత్రను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు రామారావు వెల్లడించారు. బుధవారం యాత్ర ప్రారంభ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 7 నుంచి 29వరకు 23 రోజుల పాటు యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం అక్కయ్యపాలెం శాంతిపురంలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రారంభమైన ఉత్తరాంధ్ర ఆత్మగౌరవ యాత్ర, ముందుగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యమ దీక్షా శిబిరాన్ని సందర్శించి, వారికి సంఘీభావం తెలిపింది. తుని, కాకినాడ, అమలాపురం, ధవళేశ్వరం చేరుకుని, ధవళేశ్వరంలో సేకరించిన గోదావరి నదీ జలాలతో మిగిలిన యాత్రను జగ్గంపేట, నర్సీపట్నం అనకాపల్లి ఎస్ కోట, విజయనగరం, గజపతినగరం, బొబ్బిలి, పార్వతీపురం, పాలకొండ, మందస, ఇచ్ఛాపురం, సోంపేట, పలాస టెక్కలి, నరసన్నపేట, ఆముదాలవలస, రాజాం రణస్థలం, పైడి భీమవరం, భోగాపురం, మధురవాడ మీదుగా ఈనెల 29న తిరిగి విశాఖపట్నం చేరుతుందన్నారు ఉత్తరాంధ్ర ప్రజాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కర్రి ఆదిబాబు మాట్లాడుతూ. రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కుతోనే ఉత్తరాంధ్ర ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుందామని పిలుపునిచ్చారు.

రెవెన్యూ ఉద్యోగులకు రక్షణ కల్పిస్తాం

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జున

ప్రజాశక్తి - ఆరిలోవ : రెవెన్యూ అధికారులు, సిబ్బందికి ఎటువంటి భయందోళనలకు గురి కావద్దని, అందరికీ అన్ని విధాలా రక్షణ కల్పిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున భరోసానిచ్చారు. బుధవారం డిప్యూటీ కలెక్టర్ మయూర్ అశోక్, ఆర్‌డిఒ భాస్కర్‌రెడ్డితో కలిసి చినగదిలి తహశీల్దారు కార్యాలయాన్ని సందర్శించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన తహశీల్దారు శివన్నారాయణ, రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు, సచివాలయం కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఇటీవల తహశీల్దారు రమణయ్య హత్యకు గురైన నేపథ్యంలో, రెవెన్యూ ఉద్యోగుల్లో భయాన్ని పోగొట్టేందుకు పలు సూచనలు, సలహాలు అందజేశారు.వారిలో ధైర్యం నింపే చర్యలు చేపట్టి, భరోసానిచ్చారు.

అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ తహశీల్దారు రమణయ్య హత్యకు గురైన నేపథ్యంలో రెవెన్యూ ఉద్యోగులు కొంతవరకు భయాందోళనలకు గురౌతున్నారని, వారిలో ధైర్యాన్ని నింపేందుకు పలు సూచనలు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులకు ఇకనుంచి పూర్తి రక్షణ కల్పిస్తామన్నారు భూసమస్యలపై ఇకనుంచి తహశీల్దార్ కార్యాలయానికి ఎవరైనా వస్తే, సంబంధిత భూమి యజమాని, లేదా వారి బంధువులను ఒకరిని మాత్రమే కార్యాలయంలోకి అనుమతించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మధ్యవర్తులెవరూ కార్యాలయంలోకి ప్రవేశించకుండా ఆంక్షలు ఉంటాయన్నారు. ఎవరికైనా ఏదైనా పని ఉంటే కార్యాలయానికి మాత్రమే రావాలని, ఇంటికి అనుమతించవద్దని అధికారులను ఆదేశించామన్నారు. రెవెన్యూ ఉద్యోగులకు, విఆర్‌ఒలకు మరింత భద్రత ఏర్పాటు చేస్తామన్నారు.కార్యాలయాల్లో సిసి కెమెరాలను పటిష్టంగా ఏర్పాటు చేస్తామన్నారు. రెవెన్యూ కార్యాలయాలలో సెక్యూరిటీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దీనిపై ఇప్పటికే నగర పోలీసు కమిషనర్‌తో చర్చించామన్నారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు కృషి

నగర మేయర్ హరి వెంకటకుమారి

శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కెకె.రాజు

ప్రజాశక్తి -సీతమ్మధార : గ్రేటర్ విశాఖ నగర ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. బుధవారం జివిఎంసి ఐదవ జోన్, 47వ వార్డులో బాబూ జగ్జీవన్ నగర్, రాంజీ ఎస్టేట్, సంజీవయ్య కాలనీ తదితర ప్రాంతాలలో రూ. 88.45 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, వార్డు కార్పొరేటర్ కంటిపాము కామేశ్వరిలతో కలిసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బాబూ జగ్జీవన్ నగర్‌లో రూ.27.15లక్షలతో సామాజిక భవనం ఆధునీకరణ, సిసి రోడ్లు, కాలువల నిర్మాణ పనులకు, రాంజీ ఎస్టేట్‌లో రూ.39.60 లక్షలతో ప్రధాన వరద నీటి కాలువల నిర్మాణ పనులకు, సంజీవయ్య కాలనీ-2లో రూ.18.70 లక్షలతో సామాజిక భవనం మొదటి అంతస్తు నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జివిఎంసి ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయం సిబ్బంది, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

44వ వార్డు, అబీద్‌నగర్‌లో...

జివిఎంసి 44వ వార్డు అబీద్ నగర్‌లో రూ.38.46లక్షలతో అభివృద్ధి పనులకు జివిఎంసి ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు శంకుస్థాపన చేశారు. అనంతరం ధాన్ ఫౌండేషన్ భవనం, పునర్నిర్మించిన జిమ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు వైసిపి నేతలు హబీబ్, మహదాస్ గోపి, పి.గోపి, సీతారాం, జి, వెంకటరావు, బషీర్, ప్రకాష్, ప్రసాదు, వెంకట్, ధాన్ ఫౌండేషన్ సిఇఒ మురళి పాల్గొన్నారు.

16న భారత్‌బంద్ జయప్రదం చేయండి

ప్రజాశక్తి -ములగాడ: ఈనెల 16న అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని కార్మికులకు టిఎన్‌టియుసి విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు నక్క లక్ష్మణరావు పిలుపునిచ్చారు. బుధవారం ఆర్‌కె.పురం లేబర్ గేట్ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ, పరిశ్రమలలో కార్మికులకు కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఏదైనా ప్రమాదం జరిగితే తక్షణ వైద్య సదుపాయం అందేలా యాజమాన్యాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్రాయి నాగార్జునరావు, నేతలు కె.ఆది, పొక్కల కృష్ణ, పెద్దాడ భూలోక, కొన శేఖర్, హెచ్‌ఎస్ఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రంజాన్ ప్రసాద్,

మాట్లాడుతున్న టిఎన్‌టియుసి నేత లక్ష్మణరావు

కోరమండల్ పెటిలైజర్స్ వర్కర్స్ యూనియన్ ఊరుకోటి హరి యాదవ్, డాక్ యార్డ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేత సురేష్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి కె తారక్, కోశాధికారి చెల్లుబోయిన శ్రీను, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా క్రీడా మైదానం పరిశీలన

ప్రజాశక్తి-ఆనందపురం : 'ఆడుదాం ఆంధ్ర' రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు మండలంలో దబ్బంద టిడ్కో కాలనీ వద్ద క్రీడా మైదానాన్ని బుధవారం జిల్లా జాయింట్ కలెక్టర్ అశోక్, డిపిఒ శ్రీనివాస్, ఆర్డీవో భాస్కర్ రెడ్డి పరిశీలించారు. 1500 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం ఉన్నందున వారి వసతి ఏర్పాట్లను పరిశీలించారు. క్రీడాకారులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. తహశీల్దార్ హేమంత్ కుమార్, ఆర్ఐ మణికంఠ పాల్గొన్నారు

క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్

నేడు జెవివి సైన్స్ కళాయాత్ర రాక

ప్రజాశక్తి -గాజువాక : జనవిజ్ఞాన వేదిక (జెవివి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి సైన్స్ కళాయాత్ర ఈనెల 8న గురువారం మధ్యాహ్నం ఒంటిగంటకు గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చేరుకుంటుందని జెవివి జిల్లా అధ్యక్షుడు ఎస్‌వికె.పరశురాం ఒక ప్రకటనలో తెలిపారు. సైన్స్ కళాయాత్ర ప్రదర్శనలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ సభ్యత్వ నమోదు

యూనియన్ సభ్యత్వ గుర్తింపు కార్డులు అందుకున్న జర్నలిస్టులు

ప్రజాశక్తి- భీమునిపట్నం : ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) విశాఖ అర్బన్ యూనిట్ ఆధ్వర్యాన బుధవారం తగరపువలస ప్రెస్‌క్లబ్‌లో సభ్యత్వ నమోదు జోరుగా సాగింది. స్థానిక జర్నలిస్టులకు ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పి నారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యులు జి శ్రీనివాసరావు ఈ ఏడాది సభ్యత్వనమోదు గుర్తింపు కార్డులు అందజేశారు. రాష్ట్ర కౌన్సిల్‌సభ్యులు పుర్రేవు రంగ ధామారావు, పలువురు ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పెన్షనర్ల దీక్షలు

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకుడు

ప్రజాశక్తి -కరాస: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ యూనియన్ ఆధ్వర్యంలో నగరంలోని మర్రిపాలెం వద్ద నున్న పిఎఫ్ కార్యాలయం వద్ద ఇపిఎఫ్ 95పెన్షనర్ల దీక్షలను కొనసాగించారు. బుధవారం మూడోరోజున దీక్షల్లో విశాఖ బిహెచ్‌ఇఎల్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు ఆందోళనను కొనసాగిస్తామని హెచ్చరించారు. దీక్షల్లో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు జె.కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.హుస్సేన్, టి భాస్కరరావు, కెపి.కుమార్, జగన్నాథస్వామి, శంకరరావు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

గీతం ఆధ్వర్యాన మెగా వైద్య శిబిరం

రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -తగరపువలస : ఎన్టీఆర్ సేవా సమితి ట్రస్ట్, ఎంవివిఎస్ మూర్తి ట్రస్ట్, జిమ్‌సర్ గీతం వైద్యకళాశాల సంయుక్త ఆధ్వర్యాన చిట్టివలస ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో బుధవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు సాధారణ పరీక్షలు, చిన్న పిల్లలకు ప్రత్యేక వైద్య సేవలతోపాటు కళ్లు, చెవి, ముక్కు, గొంతు, నరాల బలహీనత, కీళ్ల నొప్పులు, రక్తపోటు, మధుమేహం, చర్మ వ్యాధులకు నిపుణులైన వైద్యులు పరీక్షలు చేశారుఉచితంగా మందులు పంపిణీ చేశారు. టిడిపి నియోజకవర్గ ఇంచార్జి కోరాడ రాజబాబు.పార్టీ నాయకులు పిట్టా సురేష్, టి సూరిబాబు, గంటా నూకరాజు, వానపల్లి సత్య, గరే సదానంద, పిల్లా రాజేష్, చిలకా నరసింగరావు, గిడుతూరి శ్రీనివాసరావు, డి వెంకటేష్ బడిగింటి నీలకంఠం, ఒకటో వార్డు జనసేన అధ్యక్షులు పరిమి భువనేశ్వరి పాల్గొన్నారు

ప్రజా పోరు బాట

అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డును పునర్నిర్మించాలని

- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిల పక్ష పార్టీలు, ప్రజా సంఘాల నిర్ణయం
- పోరాట కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-మునగపాక

అనకాపల్లి నుండి అచ్యుతాపురం వెళ్లే రోడ్డును పునర్నిర్మించాలని కోరుతూ ప్రజా పోరుబాట నిర్వహించాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు నిర్ణయించారు. ఈ మేరకు స్థానిక ప్రాథమిక సహకార సంఘం ఫంక్షన్ హాల్లో బుధవారం సిపిఎం నాయకులు కాండ్రేగుల రామ సదాశివరావు అధ్యక్షతన ప్రజాసంఘాలు, అఖిలపక్ష పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. రోడ్డును వెంటనే పునర్నిర్మించాలని, ప్రజల ప్రాణాలు కాపాడాలని, పరిమితికి మించి నడుపుతున్న భారీ వాహనాలను నిలుపుదల చేయాలనే డిమాండ్లతో ఈ ప్రజా పోరుబాట నిర్వహించాలని సమావేశంలో పాల్గొన్న అన్ని పక్షాల నాయకులు ఏకగ్రీవంగా తీర్మానించారు. రోడ్డు పునర్నిర్మాణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహించాలని, ప్రజలందరినీ చైతన్యం చేసి 12వ తేదీన నాగులపల్లి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న అన్ని గ్రామాల కూడలిలో భారీ మానవ హారాలు నిర్వహించాలని నిర్ణయించారు. అప్పటికీ అధికారులు స్పందించి రోడ్డుపై ఎటువంటి నిర్ణయాన్ని ప్రకటించకపోతే నిరవధికంగా రోడ్డు దిగ్బంధం, బంద్ నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. సిపిఎం నాయకులు కాండ్రేగుల రామ సదాశివరావు కన్వీనర్‌గా 25 మందితో పోరాట కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈ కమిటీ ఆధ్వర్యంలో కార్యాచరణ పూర్తిస్థాయిలో జయప్రదంకై అన్ని గ్రామాల ప్రజలు, యువకులు, సంఘాలు, యూనియన్లు, పార్టీలు కలిసి రావాలని సమావేశం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఆడారి గణపతి అచ్చం నాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, టిడిపి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, మొల్లేటి సత్యనారాయణ, జనసేన నాయకులు టెక్కలి పరశురాం, సిపిఎం నాయకులు కర్రి అప్పారావు, ఆళ్ళ మహేశ్వరరావు, గంటా శ్రీరామ్, సరగడం శివ బాబు నాయుడు, కాండ్రేగుల సూర్యనారాయణ, ఆడారి సూర్యప్రకాష్, ఎల్లపు గోవిందు, పరశురాము, మణికంఠ, ఆడారి రామకృష్ణ, భీమిని జగదీష్, రొంగలి రాము, ఆడారి మహేష్, ఎస్ బ్రహ్మాజీ, సిఐటియు నాయకులు వివి శ్రీనివాసరావు, ఎస్ నాగు, కె అప్పారావు, పోలవరపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పోరాట కమిటీ కన్వీనర్ రామ సదాశివరావు

మాట్లాడుతున్న డివిజనల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్

పోస్టాఫీసు పొదుపు ఖాతాలపై ప్రచారం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

పోస్టాఫీస్‌లో పొదుపు పథకాల్లో భాగస్వాములు కావాలని అనకాపల్లి డివిజన్ పోస్టల్ ఇన్స్పెక్టర్ బి.శివప్రసాద్ పిలుపునిచ్చారు. ఖాజీపాలెం బ్రాంచ్ పోస్ట్ ఆఫీస్ కార్యాలయం ఆవరణలో బుధవారం పొదుపు పథకాల్లో ప్రచారంలో భాగంగా గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి యోజన, వయోజనాలకు గ్రామీణ తపాలా జీవిత బీమా పథకం, కార్మికులకు కర్షకులకు ప్రమాద బీమా పథకం, రికరింగ్ డిపాజిట్ కాల వ్యవధి డిపాజిట్ కిసాన్ వికాస పత్రం సేవింగ్స్ అకౌంట్ అటల్ పెన్షన్ యోజన పెన్షన్ పథకం తదితర వాటిని ఆయన వివరించారు. ప్రమాద బీమా పథకంలో రూ.520తో చేరి 10 లక్షల రూపాయల వరకు బీమా సదుపాయం పొందవచ్చని చెప్పారు. ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ అకౌంట్ తెరిచి పిఎం కిసాన్ రైతు భరోసా విద్యా ప్రభుత్వ సంక్షేమ పథకాలలో నగదును నేరుగా మీ గ్రామ పోస్ట్ ఆఫీస్ ద్వారా పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో మెయిల్ ఓవర్ షీర్ చిరంజీవి, విశాఖ డెయిరీ ప్రతినిధి పీలా తులసి రాము, జగ్గంపేట గ్రామ సర్పంచ్ దొడ్డి వెంకటలక్ష్మి కృష్ణ, వైద్యులు టి విష్ణు బాబు, జగ్గన్నపేట , కాజి పాలెం గ్రామాలకు చెందిన మహిళలు యువకులు, తపాలా శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : గురుకుల పాఠశాలలు/ కళాశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 23 తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెనుగుపూడి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్. రవీంద్రనాథ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ మీడియంలో ఉంటుందని తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంత్సరంలో ఎంపీసీ, బైపిసి, కోర్సులలో ప్రవేశాలకు కూడా దరఖాస్తులను సమర్పించాలని కోరారు. ప్రవేశ పరీక్ష ద్వారా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. మార్చి 10వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 5వ తరగతి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 వరకు జూనియర్ ఇంటర్ ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు దగ్గరలో ఉన్న గురుకుల పాఠశాలలోనూ, 9705356035/ 9492410867 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సిసి రోడ్లు, కాలువల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం సత్యనారాయణపురం-2 పరిధి మూలపేట గ్రామంలో ఉన్న సచివాలయానికి కాలువపై వంతెన, రోడ్డు, కాలువ రక్షణ గోడ, సీసీ కాలువల నిర్మాణానికి ఎంపిపి గొర్లి సూరిబాబు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజా పరిషత్ నిధుల నుండి సుమారు రూ.20 లక్షల మంజూరు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పలక భాగ్యలక్ష్మి సత్తిబాబు, ఎంపీటీసీ కరిమజ్జి అలివేణి మల్లేశ్వరరావు, వైఎస్ఆర్‌సిపి గ్రామ పార్టీ అధ్యక్షులు చవ్వకుల ఈశ్వరరావు, పల్లా ముత్యాలరావు,కరిమజ్జి మహాలక్ష్మి నాయుడు,వార్డు సభ్యులు పిన్నింటి రాజు, పలక నాగ విష్ణు,పెంటకోట సంతోష్ కుమార్,పప్పల జగన్నాథరావు, వైసీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజలో పాల్గొన్న ఎంపిపి సూరిబాబు

తాళ్లపాలెం-నర్సీపట్నం రోడ్డులో దట్టంగా కురుస్తున్న పొగమంచు

దట్టంగా పొగ మంచు

పంటలకు తీవ్ర నష్టం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : రెండు రోజులుగా మండలంలోని పలు గ్రామాల్లో పొగ మంచు దట్టంగా కురుస్తోంది. తెల్లవారుజామునుండి పొగ మంచు ప్రారంభమై ఉదయం 8 గంటల వరకు కురుస్తూనే ఉంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీ ప్రాంతం వలె ఎదురొచ్చే వాహనాలు సైతం కనిపించడం లేదు. దీంతో వాహనదారులు హెడ్ లైట్లు వేసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. తేనె మంచి ప్రభావంతో పంటలకు సైతం నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. ఆకు కూర, కూరగాయలు సాగుకు సైతం తేనె మంచు ప్రభావంతో నష్టం వాటిళ్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వంగ, బెండ, బీర తదితర కూరగాయల పంటలు, జీడి, మామిడి పూత మాడిపోతుందని అని రైతులు వాపోతున్నారు.

కశింకోట : కశింకోట మండలంలో తాళ్లపాలెం-నర్సీపట్నం రోడ్లో బుధవారం తెల్లవారుజామున దట్టంగా పొగ మంచు కురిసింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణం కొనసాగించారు. రైతులు ఎండ వచ్చిన తర్వాత పొలాలకు వెళ్లారు. వృద్ధులు, పిల్లలు మంచు తీవ్రతకు ఇబ్బందులు పడ్డారు.

9న మండల పరిషత్తు సమావేశం

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 9న జరుగుతుందని ఎంపీడీఓ సిహెచ్ సుబ్బలక్ష్మి తెలిపారు. ఆరోజు ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగు సమావేశానికి జడ్పీటీసీతో పాటు మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీల్లో జిల్లాకు 5వ స్థానం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : భీమిలిలో జరిగిన రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలలో అనకాపల్లి జట్టు 5వ స్థానంలో నిలిచింది. ఈ మేరకు అచ్యుతాపురం పోలీస్ గ్రౌండ్లో బుధవారం క్రీడాకారులకు ప్రశంస పత్రాలను గ్రామ సర్పంచ్ కె విమలా నాయుడు చేతులమీదుగా అందజేశారు. మిడి రైన్ హాస్పిటల్ డాక్టర్ జగదీష్ క్రీడాకారులకు డ్రెస్ కోడ్ ఇవ్వటానికి ముందుకు వచ్చారు. క్రెస్ట్ విద్యా విహార్ కరస్పాండెంట్ రెడ్డి గణేష్, క్రీడాకారులు గురించి మాట్లాడారు. కోచ్‌గా ఎంపికైన కె.నాగ వెంకటరావును సన్మానించారు. పీఈటీలు క్రెస్ట్ శివ అచ్యుత శివాజీ అప్పలరాజు కె రమేష్ దేవతా రాజు పాల్గొన్నారు.

ఘనంగా పిబివిఎస్ఎన్.రాజు జన్మదిన వేడుకలు

రాజు జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి బండారు

ప్రజాశక్తి- సబ్బవరం

తెలుగు యువత జిల్లా అధ్యక్షులు పిబివిఎస్ఎన్.రాజు జన్మదిన వేడుకలు స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా విచ్చేసి కేక్ కట్ చేసి రాజుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మండల టిడిపి సమన్వయ కమిటీ సభ్యులు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు రాజు జన్మదిన వేడుకల్లో పాల్గొని రాజుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గండి దేముడు, మాజీ ఆర్ఇసిఎస్ చైర్మన్ కోటాన అప్పారావు, కరకదేముడు, ఆకుల గణేష్, కోరాడ శ్రీనివాసరావు, బలిరెడ్డి సూర్య ప్రసాద్, పల్లా తాతారావు, బి.హర గోపాల్, పొట్ల కన్న తదితరులు పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సి కోసం నేటి ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-చోడవరం

మెగా డీఎస్సీ ప్రకటించాలని కోరుతూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అనకాపల్లి ఆర్డీవో ఆఫీస్ వద్ద గురువారం జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్‌వి నాయుడు కోరారు. అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నుండి ఉదయం 10 గంటలకు ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందన్నారు. రాష్ట్రంలో 25000 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా కేవలం 6100 పోస్టులు మాత్రమే భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం నిరుద్యోగులు మోసం చేయడమే అవుతుందన్నారు. మెగా డీఎస్సీ కోసం లక్షలాది మంది నిరుద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నారని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గతంలో చేసిన వాగ్దానం అమలు చేయాలని కోరారు.

మెగా డిఎస్‌సి ప్రకటించకుంటే ఓటమి తప్పదు

అనకాపల్లి : ఎన్నికల ముందు మెగా డీఎస్సీ ఇస్తామని చెప్పి ఐదేళ్లగా నిరుద్యోగులను జగన్మోహన్ రెడ్డి ఊరించి మెగా మోసం చేశారని, అప్రెంటిస్ విధానం తీసుకువచ్చి నిరుద్యోగులను నిలువునా మోసం చేశారని ఏఐవైఎఫ్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి వియ్యపు రాజు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో బుధవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్రంలో 25 వేల ఉపాధ్యాయులు ఖాళీగా ఉన్నాయని, వాటిని మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తామని, ఐదేళ్ళుగా ఊరించి ఊరించి ఇప్పుడు చావు కబురు చల్లగా చెప్పినట్లు 6100 ఇవ్వటం మెగా మోసమని పేర్కొన్నారు. కొత్తగా తీసుకొచ్చిన అప్రెంటిస్ విధానం రద్దు చేయాలని కోరారు. మెగా డీఎస్సీ ఇవ్వకపోతే మెగా ఓటమి తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో బర్నికాన సాయి, వి నరేంద్ర, ఆర్ శ్రీనివాసరావు, ఎస్ నవీన్, ఎస్ నాయుడు, ఏ నాయుడు బాబు తదితరులు పాల్గొన్నారు.

79వ వార్డులో కార్పొరేటర్ పర్యటన

ప్రజాశక్తి - పరవాడ : జివిఎంసి 79వ వార్డు పరిధిలో ఆ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ బుధవారం పర్యటించారు. ప్రశాంతి నగర్ సచివాలయం పరిధి షిరిడి సాయి నగర్ రోడ్ నెంబర్ 4, సాయి వైష్ణవి ఎన్‌క్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మురుగునీరు పోయే డ్రైనేజీలు లేవని కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి ఆయన వెంటనే ఆయన స్పందించి వాళ్ల సమస్యలు స్వయంగా చూసి త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రహరీ ఆనుకొని కొత్తగా అపార్ట్మెంట్ నిర్మిస్తున్న బిల్డర్ డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా కప్పి ఆక్రమణ చేయుచున్న ప్రదేశాన్ని సందర్శించారు. ఈ సమస్యను వెంటనే కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్తానని ఆయన తెలిపారు. చీకటి వారివీధిలోని డ్రైనేజీ సమస్యను కూడా పరిశీలించారు. ఈ కాలనీవాసులు చేతిపంపు కావాలని కార్పొరేటర్‌ని కోరడంతో దానిపై కూడా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, సచివాలయ కార్యదర్శి కనకేశ్వరరావు, పాల్గొన్నారు.

క్షతగాత్రునికి సిఐటియు నేతల పరామర్శ

ప్రజాశక్తి-అచ్యుతాపురం : అచ్యుతాపురం ఎస్ఇజెడ్ ఫార్మా పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడికి కెమికల్ శరీరంపై పడడంతో కళ్ళు శరీరం ఇన్ఫెక్షన్కు గురికావడంతో వైద్య సేవ నిమిత్తం ఆసుపత్రిలో చేర్చారు. చికిత్స పొందుతున్న కార్మికుడు దిలీప్ను సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ రాము బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో రసాయనిక పదార్థాలు శరీరంపై పడడంతో కార్మికుడు దిలీప్ తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడని చెప్పారు ఆ కార్మికునికి మెరుగైన వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికుడు కోలుకొనేంతవరకు వేతనం ఇవ్వాలని, అనంతరం ఉపాధి యధావిధిగా కల్పించాలని కోరారు.

తహశీల్దారును కలిసిన కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి - పరవాడ : మండల తహశీల్దారుగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ గణపతిరావును బుధవారం కాంగ్రెస్ ఓబిసి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ఆర్.నాయుడు, మండల అధ్యక్షులు గోరుపూటి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అధికార పార్టీకి చెందిన కొంతమంది బడాబాబులు, చోటా నాయకులు, గెడ్డలను, వాగులను పూడ్చి కబ్జాలు చేస్తున్నారని, వీటిని అరికట్టాలని తాహసీల్దార్కి విన్నవించారు. వాటిని పరిశీలిస్తానని తహసీల్దార్ తెలిపారు.

నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలో ఉన్న అన్ని పాఠశాలల విద్యార్థులకు బుధవారం కె.కోటపాడు జడ్పీ హైస్కూల్లో నులిపురుగులు మాత్రలు పంపిణీ చేశారు. చౌడువాడ, లంకవానిపాలెం పిహెచ్సి సిబ్బంది, స్థానిక ఇంచార్జ్ ఎంపీడీవో ఎస్ అప్పలరాజు చేతులమీదుగా ఉపాధ్యాయులకు అందించారు. ప్రతి పాఠశాలలకు అంగన్వాడీ కేంద్రాలకు ఆయా స్థానిక ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు వెళ్లి విద్యార్థులకు స్వయంగా మాత్రలు వేయాలని ఎంపీడీవో సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

కార్మికశాఖ ధ్రువపత్రాలు రెన్యువల్ చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి దుకాణదారు, సంస్థల నిర్వాహకులు తప్పనిసరిగా కార్మిక శాఖ ధ్రువపత్రాన్ని కలిగి ఉండాలని కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ వసంతరావు తెలిపారు. స్థానిక జిల్లా కార్మిక శాఖ కార్యాలయంలో బుధవారం వర్తక వాణిజ్య సంఘ ప్రతినిధులు, కార్మిక శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్లు, రెన్యువల్ కోసం తమ కార్యాలయానికి రాకుండానే సంబంధిత గ్రామ వార్డు సచివాలయాల్లో, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 29 లోగా దరఖాస్తులు రెన్యువల్లు చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఏ ఎస్ ఆర్ జిల్లా ఇన్చార్జి టి సుజిత, చోడవరం సహాయ కార్మిక శాఖ అధికారి పి సూర్యనారాయణ, అనకాపల్లి కార్మిక శాఖ అధికారులు బాలకృష్ణ, నరేంద్ర పాల్గొన్నారు.

రెమిడీయల్ టీచింగ్ పరిశీలన

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల రెమిడీయల్ టీచింగ్ను ఎంఈఓ-2 బి.ఎస్.ఎన్ మూర్తి బుధవారం పరిశీలించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మార్చి18 నుండి జరగనున్న పదో తరగతి పరీక్షలకు ఆరిపాక పాఠశాల నుండి 96 మంది విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-చోడవరం : స్థానిక స్వయంభూ గౌరీశ్వర స్వామి ఆలయం జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 105 మంది కంటి రోగులను పరీక్షలు చేశారు. వారిలో 36 మందికి కంటి ఆపరేషన్కు ఎంపిక చేసి శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు కొడమంచలి చలపతిరావు, శంకర్ ఫౌండేషన్ ఆప్తలమిక్ ఆఫీసర్ హరి చందన, క్యాంపు మేనేజర్ అరుణ్ కుమార్, కో-ఆడినేటర్ ప్రసాద్, గవర్నమెంట్ కంటి వెలుగు ఆప్తలమిక్ ఆఫీసర్ శ్రీనివాసరావు, రాజీవులోచన, నర్సింగ్ స్టాఫ్ దీపికా, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఒపిఎస్ అమలుకు పోస్టుకార్డు ఉద్యమం

పోస్టు కార్డులు రాస్తున్న యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- పెందుర్తి

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఓటు ఫర్ ఒపిఎస్ ఆందోళనలో భాగంగా రాష్ట్రంలోని రాజకీయ పార్టీల అధ్యక్షులకు పోస్టుకార్డులు రాసే ఉద్యమాన్ని బుధవారం శాంతినగర్ హైస్కూలులో నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ నేత టి.ఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ, అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే సిపిఎస్ను రద్దుచేస్తామని ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్ మాటలను నమ్మి ఉద్యోగ, ఉపాధ్యాయులంతా మోసపోయారన్నారు. ఇదే పరిస్థితి పునరావృతం కాకుండా వచ్చే ఎన్నికలలో పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని, అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకాన్ని ఒపిఎస్ అమలుపై చేస్తామనితమ మేనిఫెస్టోలో స్పష్టమైన హామీ ఇచ్చిన వారికే ఉపాధ్యాయులతోపాటు వారి కుటుంబసభ్యులంతా మద్దతుగా ఉంటామని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ఈ మేరకు రాజకీయ పార్టీల రాష్ట్ర అధ్యక్షులకు పోస్టు కార్డులను రాస్తున్నామని, దీనిపై స్పందించి, మాటిచ్చిన వారికే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నేతలు సీతామహాలక్ష్మి, మండల సహాధ్యక్షురాలు శోభారాణి, చిన గదిలి మండల ప్రధాన కార్యదర్శి పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్ల ఆవిష్కరణ

అచ్యుతాపురం : ఓట్ ఫర్ ఒపిఎస్ గోడపత్రికలను

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు

అచ్యుతాపురం మండల కేంద్రంలో బుధవారం యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. మండల విద్యాశాఖ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, తాసిల్దార్ కార్యాలయం ఆవరణ వరకు యుటిఎఫ్ ఉపాధ్యాయులు ర్యాలీగా వెళ్లి ఆవిష్కరణ కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అచ్యుతాపురం మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం నానాజీ, కె సుభాషిని దేవి, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం సూర్యలక్ష్మి ,మురళీకృష్ణ, పారిజాతం, కమల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చింతకాయల ముత్యాలు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని ముత్యాలమ్మపాలెం గ్రామంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు చింతకాయల ముత్యాలు జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆయన తన అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. సమ్మంగిపాలెం, జాలారిపేట, దిబ్బపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున హాజరై చింతకాయల ముత్యాలును పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం 300 మందికి దుప్పట్లు ,450 మందికి చీరలు, 100 మందికి 10 కేజీల చొప్పిన బియ్యం పంపిణీ చేశారు. మహిళా పారిశుద్ధ్య కార్మికులకు బియ్యం అందించారు. పదోతరగతిలో ప్రతిభ గల విద్యార్థులకు మొదటి బహుమతి వాసుపల్లి దిలీప్కు రూ.5వేలు, గనగళ్ళ బానుకు రెండవ బహుమతి రూ.3500, చింతకాయల మనోజ్ కుమార్కు మూడవ బహుమతి

విద్యార్థులకు మెరిట్ బహుమతులు అందజేస్తున్న ముత్యాలు

రూ.2500 నగదు అందజేశారు. అనంతరం వెయ్యి మందికి అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను, మండల కోఆప్షన్ మైలపల్లి అప్పన్న, మాజీ ఎంపిటిసి చింతకాయల అమ్మోరు, మాజీ కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, వైస్ సర్పంచ్ సూరాడ పెంటయ్య, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మహేష్

ప్రజాశక్తి- అనకాపల్లి : న్యూ నవ్యాంధ్ర టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అనకాపల్లి గవర పాలేనికి చెందిన మహేష్ నియమితులయ్యారు. ఈ మేరకు అనకాపల్లి వెల్లుల వీధి గౌరీ పరమేశ్వర ఆలయంలో స్థానిక సీనియర్ టైలర్స్, క్రౌన్ టైలర్స్ మాస్టర్ ముత్తా ఈశ్వరరావు, కోనేటి భద్రం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అతికినిశెట్టి సత్యనారాయణ న్యాయసలహా దారులు తెలగారెడ్డి పుల్లయ్య నాయుడు చేతుల మీదుగా నియామక పత్రం అందజేయడం జరిగింది. అనంతరం మహేష్ను సత్కరించారు. ఈ కార్యక్రమం లోకాశి బ్రాహ్మజీ, కొరుప్రోలు గౌరీష్, దుర్గా, ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి మలపురెడ్డి దరఖాస్తు

ప్రజాశక్తి-అనకాపల్లి, కశింకోట : రాబోయే సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తరుపున అనకాపల్లి అసెంబ్లీ స్థానం నుండి పోటీ చేసేందుకు విజయవాడ ఆంధ్ర రత్న భవన్లో కొత్తపల్లి బుచ్చయ్యపేట మాజీ సర్పంచ్, అనకాపల్లి అసెంబ్లీ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు మలపురెడ్డి కోటేశ్వరరావు బుధవారం దరఖాస్తు చేసుకున్నారు. గడచిన 33 సంవత్సరాలుగా పార్టీకి సేవచేస్తున్నానని, అని రాబోయే ఎన్నికలలో అనకాపల్లి అసెంబ్లీ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కత్తెర శ్రీధర్, అనకాపల్లి పార్లమెంట్ పరిశోధన సమన్వయకర్త బోయిన భాను మూర్తి యాదవ్, ఆర్ ఆర్ నాయుడు, సూరి శెట్టి ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై స్పందించిన ఎస్టీ కమిషన్

ప్రజాశక్తి- అనకాపల్లి : గొలుగొండ మండలం, జోగింపేట హాస్టల్లో ఏడవ తరగతి విద్యార్థి డేవిడ్ రాజు కరెంట్ షాక్ కొట్టి మృత్యువాత పడినట్లు పత్రికల ద్వారా తెలుసుకున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తక్షణమే ఆ జిల్లా అధికారులను సంఘటనపై పూర్తి నివేదిక ఇవ్వాలని కోరారు. ఇటువంటి దుర్ఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వారం రోజుల్లో సంఘటన పై నివేదికను, తీసుకున్న చర్యలని తెలియజేయాలని కలెక్టర్ను కమిషన్ కోరింది. త్వరలో ఆ కుటుంబాన్ని కమిషన్ చైర్మన్ పరామర్శ చేయనున్నారు.

9న డిగ్రీ కళాశాలలో జాబ్మేళా

ప్రజాశక్తి-చోడవరం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉద్యోగ కల్పనలో భాగంగా చోడవరం గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 9న అమలాపురంలోని కిమ్స్ (కోనసీమ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్) హాస్పిటల్ ఆధ్వర్యాన మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి టి. చాముండేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు ఇంటర్, నర్సింగ్ చదువుకొని 18 నుండి 27 సంవత్సరాల లోపు యువతీ, యువకులు పాల్గొనే అవకాశం ఉందన్నారు. మరిన్ని వివరాలకు 7036363272 నెంబర్కు సంప్రదించాలని ఆయన కోరారు.

సచివాలయాలను పరిశీలించిన భరత్ కుమార్

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని ఎన్జీ పాలెం, జె తుని, చింతలపాలెం సచివాలయాలను వైసిపి అనకాపల్లి నియోజకవర్గ ఇన్చార్జ్ మలసాల భరత్ కుమార్ బుధవారం పరిశీలించారు. అక్కడి సమస్యలను, ఇతర అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆ గ్రామ వైసీపీ కార్యకర్తలతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు మలసాల కిషోర్, సర్పంచులు కోన అరుణ నాగేశ్వరరావు, కొట్ల రాము, కలిగట్ల నూక రత్నం నాయుడు, కేవీ సత్యనారాయణ పలువురు నాయకులు పాల్గొన్నారు.

విభజన హామీలపై రాజీలేని పోరాటం : కొణతాల

ప్రజాశక్తి- అనకాపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి విభజన హామీల అమలుపై రాజీలేని పోరాటం చేస్తామని మాజీ మంత్రి, జనసేన నాయకులు కొణతాల రామకృష్ణ వెల్లడించారు. స్థానిక గౌరీ గ్రంథాలయంలో బుధవారం విలేకరులతో ఇష్టాగోష్టి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ విభజన హామీలపై స్పష్టత కలిగి ఉన్నారన్నారు. ప్రధానంగా విశాఖ స్టీల్ ప్లాంట్, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, విశాఖ రైల్వే జోన్ వంటి అంశాలపై తమ పార్టీ అధికారంలోకి వస్తే కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఇంకా రాష్ట్రంలో పలు సమస్యలు, ప్రధానంగా ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం వంటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో అనకాపల్లి వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ, కాస్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ కొణతాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

ప్రజాశక్తి- అనకాపల్లి : జీవీఎంసీ 84వ వార్డు వైసిపి ఇంచార్జ్ కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో బుధవారం కోట్ని వీధి కళ్యాణ మండపంలో 10, 11, 12 సచివాలయ పరిధిలో సుమారు 300 మంది నిరుపేదలకు టిడ్కో గృహాల రిజిస్ట్రేషన్ పత్రాలను, తాళం కప్పలను వైసిపి అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పేదలకు ఇళ్ల స్థలాలు మాత్రమే ఇచ్చే వారని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రం ఇల్లు నిర్మించి రిజిస్ట్రేషన్ పత్రాలతో పేదలకు అందజేయడం జరుగుతుందని చెప్పారు. అనంతరం భరత్ కుమార్ ను కోట్ని వీధిప్రజల తరపున ఘనంగా గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి జాజుల రమేష్, ఏడువాకుల నారాయణరావు, డాక్టర్ యశ్వంత్,మలసాల కుమార్ రాజా, మాధురి నాయుడు,ఉగ్గిన అప్పారావు, మరిడిపంబ అమ్మవారి దేవస్థానం చైర్మన్ కోట్ని శ్రీనివాసరావు, కోరుకొండ రమేష్, అప్పికొండ రవిశంకర్, కేతిరెడ్డి ప్రసాద్, బంగారు రాజు, పైడ్రాజు మునిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

యోగ, ఆయుర్వేదంపై ప్రత్యేక శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : యోగ, ఆయుర్వేదంపై నాలుగు రోజులపాటు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పతాంజలి యోగ సమితి, భారత స్వాభిమాన ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు భీశెట్టి దొరమ్మ నాయుడు తెలిపారు. స్థానిక జార్జి క్లబ్ లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి 8 నుండి 11వ తేదీ వరకు స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో విశాఖ జిల్లా మహిళ పతాంజలి యోగ అధ్యక్షురాలు యోగానిపుణులు ప్రభ సాహెూ ప్రత్యేక తరగతులకు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారన్నారు. జీవితాంతం ఆరోగ్యంతో మెలగాలంటే ప్రతిరోజు యోగా అభ్యసించాలన్నారు. సమావేశంలో నిర్వాహకులు కాండ్రేగుల చిన్న , కొణతాల పెద్ద, అధ్యక్షులు కొలపర్తి కన్నబాబు, కార్యదర్శి భీమరిశెట్టి శ్రీనివాసరావు, బిఎస్ ఎం కె జోగి నాయుడు, ఆడారి చిన్న వీరు నాయుడు, కొణతాల శివాజీ, ఏ .రామకృష్ణ పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో 104 వైద్య శిబిరం

ప్రజాశక్తి- మునగపాక : 104 వైద్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు పిలుపునిచ్చారు. మండలంలోని వాడ్రాపల్లి గ్రామంలో బుధవారం జరిగిన 104 వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల వద్దకు మెరుగైన వైద్యం అందేలా 104 సేవలు ప్రవేశపెట్టారన్నారు. వైద్యాధికారిని ప్రవల్లిక ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

9న డి వార్మింగ్ డేను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:ఈనెల 9వ తేదీ శుక్రవారం నిర్వహించనున్న డి వార్మింగ్ డేను విజయవంతం చేయాలని ఎంపీడీవో శ్రీనివాస్, వైస్ ఎంపీపీ వీసం నానాజీ తెలిపారు. మండల పరిషత్ కార్యాల యంలో బుధవారం గొడిచెర్ల పిహెచ్‌సి వైద్యాధికారి సుకన్య, కిరణ్ ప్రసాద్ ఆధ్వర్యంలో 15000 మాత్రలను సిబ్బందికి అందజేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు, అంగన్వాడి కేంద్రాల్లో పిల్లలకు తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలను వేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏవో సీతారామరాజు, ఎంఈఓ నరేష్ పాల్గొన్నారు.

ఎస్.రాయవరం:జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో ఎం.పి.డి.ఒ. కె.సత్యనారాయణ, ఎం.ఈ.ఒ. మూర్తి చేతుల మీదగా పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ శక్తిప్రియ మాట్లాడుతూ, సర్వసిద్ధి, పెనుగొల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వైద్య సిబ్బంది ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారులు టి.సత్యనారాయణ, కె.శ్రీనివాస్, హెల్త్ సూపర్వైజర్ ఆదినారాయణ, ప్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ క్లినిక్ క్లస్టర్ పర్యవేక్షకులు ప్రసాద్ పాల్గొన్నారు .

కోటవురట్ల:నులిపురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిహెచ్సి వైద్యులు సంతోష్ కుమార్ కోరారు. మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణరాజు చేతుల మీదుగా ఎంపీడీవో కార్యాలయంలో వైద్య సిబ్బందికి అంగన్వాడీ సిబ్బందికి మాత్రల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, ఎంపిహెచ్ఓ గోవిందరావు పాల్గొన్నారు.

కోటవురట్లలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు, మహిళలు

10న చలో పాయకరావుపేట

ప్రజాశక్తి-కొత్తకోట:దళితవాడలు ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న నిర్వహిస్తున్న చలో పాయకరావుపేటను జయప్రదం చేయాలని అంబేద్కర్ ఇండియా మిషన్ రావికమతం మండలం శాఖ అధ్యక్షులు పూడి అర్జునరావు, సభ్యులు బి.బుల్లిబాబు పిలుపు నిచ్చారు. బుధవారం మండలంలోని జెడ్. కొత్తపట్నం, టి.అర్జా పురం, మేడివాడ తదితర గ్రామాలలో ఆయా ఎస్సి కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎస్సి కాలనీలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వాలు కేటాయించిన నిధులు సక్రమంగా దళిత వాడలలో వినియోగించక పోవడంతో సరైన వసతులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. చలో పాయకరావు పేట కార్యక్రమానికి దళితులు స్వచ్ఛందంగా తరలి రావాలని కోరారు. అనంతరం ఆయా గ్రామాలలో పోస్టర్‌ను ప్రదర్శించించారు

సారెను ఊరేగిస్తున్న మహిళలు

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలోని బుచ్చం పేట గ్రామంలో గౌరీపరమేశ్వరుల అనుపు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గతంలో ఈ గ్రామంలో మూడు రోజులు ఉత్సవం నిర్వహించేవారు. ఈ ఏడాది ఐదు రోజుల ఉత్సవం నిర్వహించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారిని సారెని భారీగా సమర్పించారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

డస్ట్‌బిన్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్

చెత్త సేకరణ డబ్బాల పంపిణీ

ప్రజాశక్తి -గొలుగొండ:ఏఎల్ పురంలో ప్రతి ఇంటికీ తడి, పొడి చెత్త నిల్వలకు గాను రెండు చెత్త డబ్బాలను సర్పంచ్ లోచల సుజాత బుధవారం మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రజలందరూ చెత్తను రోడ్లపై వేయరాదన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి డబ్బాల్లో వేయాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ, ఏఎల్ పురం గ్రామానికి మూడు వేల డబ్బాలు వచ్చాయని తెలిపారు.

ఘనంగా రమాబాయి అంబేద్కర్ జయంతి

ప్రజాశక్తి-ఎస్.రాయవరం:మండలంలో ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రమాబాయి అంబేద్కర్ జయంతి నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్వి రమణారావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, అంబేద్కర్ సాధించిన విజయాలకు రమాబాయి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పవన్ నియోజకవర్గంపై త్వరలోనే నిర్ణయం

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగబాబు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఎక్కడి నుంచి పోటీ చేస్తారనే అంశంపై త్వరలోనే నిర్ణయం వెల్లడిస్తామని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు తెలిపారు.బుధవారం స్థానిక ఫంక్షన్ హాల్ లో జనసేన ఆత్మీయ సమావేశం లో నాగబాబు మాట్లాడుతూ, తాను పోటీ చేసే అంశంపై పార్టీ నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. స్థానిక సమస్యలను టిడిపి, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్త రాజన్న వీర సూర్యచంద్ర, పంచకర్ల రమేష్ బాబు, సుందరపు సతీష్ కుమార్, మున్సిపల్ కౌన్సిల్ అద్దేపల్లి గణేష్ సౌజన్య పాల్గొన్నారు. రాష్ట్రంలో గోపాల మిత్రలకు టిడిపి, జనసేన ప్రభుత్వం

మాట్లాడుతున్న నాగబాబు

వచ్చిన తర్వాత న్యాయం చేస్తామని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు తెలిపారు. బుధవారం స్థానిక వేదిక ఫంక్షన్ హాలులో జరిగిన జనసేన పార్టీ ఆత్మీయ సమావేశంలో గోపాలమిత్రలు వినతిపత్రం అందజేశారు.

పాయకరావుపేట:మండలంలోని గుంటపల్లి గ్రామంలో జనసేన పార్టీ నాయకులు నియోజవర్గ ఇన్చార్జి గేడ్డం బుజ్జి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు మాట్లాడుతూ, టిడిపి, జనసేన పొత్తులో భాగంగా ఎవరినీ అభ్యర్థిగా నియమించినా కార్యకర్తలు గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు జిల్లా పార్టీ అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు, విజయకుమార్ పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు సత్కారం

ప్రజాశక్తి -మాకవరపాలెం:ఇటీవల మాకవరపాలెం తహశీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మురళీమోహన్‌రావును బుధవారం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మండలంలోని ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు అల్లు రామునాయుడు పాల్గొన్నారు.

సత్కరిస్తున్న అధికారులు

మాట్లాడుతున్న రాజు

లక్ష్యం మహాపాదయాత్ర ప్రారంభం

ప్రజాశక్తి-రోలుగుంట: మండల కేంద్రంలో జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పివిఎస్ఎన్.రాజు ఆధ్వర్యంలో బుధవారం లక్ష్యం మహాపాదయాత్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్. రాజు, నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ బత్తుల తాతయ్యబాబు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పివిఎస్ఎన్.రాజు మాట్లాడుతూ, నియోజకవర్గంలోని సమస్యలను గుర్తించేందుకు ఈ పాదయాత్ర ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అరాచకాలను అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశ్యంతో టిడిపి, జనసేన ఏకమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నియామక పత్రం అందిస్తున్న నేతలు

మత్స్యకార సంఘం గ్రామ అధ్యక్షులుగా ప్రసాద్

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో జాతీయ మత్స్యకార సంఘం నాయకులు ఆధ్వర్యంలో బుధవారం సమావేశం నిర్వహించారు. మత్స్యకార సంఘ గ్రామ శాఖ అధ్యక్షులుగా గ్రామానికి చెందిన ఎం ప్రసాద్ ను ఎన్నుకొని నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సమావేశంలో జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోసా అప్పలరాజు తదితరులు మాట్లాడారు.సముద్రం కలుషితం కాకుండా రక్షించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు.తీర ప్రాంతంలో ప్లాస్టిక్ వాడకం నిషేధించడానికి తగు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు కొవిరి వెంకటేష్, నియోజకవర్గం అధ్యక్షులు పిక్కి కోదండరావు, మండల అధ్యక్షులు వాసుపల్లి శివ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎరిపల్లి అప్పలరాజు, సిరిపల్లి అప్పలరాజు, టిడిపి గ్రామ అధ్యక్షులు పిక్కి గంగరాజు, ధోని గోపి తదితరులు పాల్గొన్నారు.

సర్వర్ సమస్య తలెత్తడంతో..

రిజిస్ట్రేషన్లకు అంతరాయం

-జగనన్న గృహ లబ్ధిదారుల అవస్థలు
- చెట్టు కింద పడిగాపులు
-పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -నక్కపల్లి:జగనన్న గృహ లబ్ధిదారులకు ప్రభుత్వం భూ హక్కు కల్పిస్తూ చేపడుతున్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు సర్వర్ సమస్య తలెత్తడంతో తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. మండలంలోని 2754 మంది జగనన్న గృహాల లబ్ధిదారులకు ఇంటి స్థలాలు, ఇళ్లకు హక్కు పత్రాలు ఇచ్చేందుకు అధికారులు గత కొద్ది రోజుల నుండి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. మండలంలోని పలు సచివాలయాల వద్ద గ్రామ పంచాయతీ కార్యదర్శి విఆర్‌ఓ, డిజిటల్ అసిస్టెంట్లు రిజిస్ట్రేషన్ల పనిలో నిమగ్నమయ్యారు. కొన్ని గ్రామాల్లో సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేసేందుకు గాను సర్వర్ సక్రమంగా అందని కారణంగా మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రత్యేక కంప్యూటర్లు ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. బుధవారం సర్వర్ పని చేయక పోవడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగలేదు. దీంతో లబ్ధిదారులు గంటల కొద్ది నిరీక్షించాల్సి వచ్చింది. ఇప్పటి వరకు సుమారుగా 1110 మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేశారు . తరచూ సర్వర్ సమస్య తలెత్తడంతో రిజిస్ట్రేషన్ లకు అంతరాయం ఏర్పడుతుందని మండల పరిషత్ కార్యాలయ ఏవో సీతారామరాజు తెలిపారు.

చెట్టు కింద వేచి ఉన్న లబ్ధిదారులు

శిథిలావస్థలో బాలుర వసతి గృహం

- కూలేందుకు సిద్ధంగా శ్లాబ్, ప్రహరీ
-మరమ్మతుకు నోచని వాటర్‌ట్యాంకు
-అవస్థలు పడుతున్న విద్యార్థులు

వాటర్ ట్యాంకు లీకేజ్ అవుతున్న నీరు

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోటలో ఎస్సి బాలుర వసతి గృహం కూలేందుకు సిద్ధంగా ఉంది. గత 30 ఏళ్ల కిందట నిర్మించిన ఈ భవనం శ్లాబ్ పెచ్చులూడి శిథిలావస్థకు చేరింది. ఈ వసతి గృహంలో 8, 9,10 తరగతులకు చెందిన సుమారు 90 మంది కి పైగా విద్యార్థులు ఉన్నారు. ప్రస్తుతం భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. భవనానికి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టక పోవడంతో భవనం శిథిలావస్థకు చేరుకుంటుంది. ఈ వసతి గృహంలో విద్యుత్ సమస్యతో పాటు మరుగుదొడ్లు కొన్ని పని చేయలేదు. ప్రహరీ గోడ కొంత మేర కూలేందుకు సిద్ధంగా ఉంది. వసతి గృహంలో విద్యుత్ సమస్య ఏర్పడినప్పు ఇన్‌వర్టర్ సదుపాయం లేక పోవడంతో విద్యార్థులు రాత్రి వేళల్లో చిమ్మ చీకట్లో నెట్టుకొస్తున్నారు. వసతిగృహం పై భాగంలో వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరి వాటర్ లీకేజ్ కావడంతో శ్లాబ్ తడిసి రూము లోపల భాగంలో పెచ్చులూడు పడుతున్నాయి. గత కొన్నాళ్లుగా విద్యుత్ వైర్లలో లోపం ఏర్పడటంతో వసతి గృహాధికారి తన సొంత నిధులతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. వసతి గృహం శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రైవేటు భవనంలోకి విద్యార్థులను తరలించాలన్న ప్రతిపాదనకు జిల్లాస్థాయి అధికారుల నుంచి ఎటువంటి స్పందన లభించలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థులను ప్రైవేటు భవనంలోకి తరలించి శిథిలావస్థకు చేరుకున్న వసతి గృహాన్ని మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు తెలిపారు. వాటర్ ట్యాంక్ లీకేజీని అరికట్టి సింథటిక్ ట్యాంకులు ఏర్పాటు చేయాలని, మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకు రావాలని కోరారు.

శిథిలావస్థలో ఉన్న హాస్టల్ భవనం

బయటకు ప్లేట్లు కడుతున్న విద్యార్థులు

వసతి గృహాల మరమ్మతు చేపట్టాలి

ప్రజాశక్తి -కొత్తకోట:ప్రమాద కరంగాను, ప్రాణ భయంగా ఉన్న ఎస్సీ సంక్షేమ వసతి గృహాలను మరమ్మతు చేపట్టాలని అనకాపల్లి జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎం.అప్పలరాజు కోరారు. బుధవారం రావికమతం మండలం కొత్తకోట గ్రామంలో ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ, వసతి గహం పూర్తిగా శిథిలమై ఉందని, కొన్ని గదులు పెచ్చులు ఊడి పడిపోయి ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కూలేందుకు భవనం సిద్ధంగా ఉందని అధికారులు గుర్తించాలన్నారు. మూడు మరుగుదొడ్లు పూర్తిగా ఉపయోగంలో లేవని, భవిష్యత్తులో వర్షాలు వస్తే చెరువును తలపించే రీతిలో హాస్టలు ఉందన్నారు. సంక్షేమ హాస్టల్స్ పై అధికారులు ఇలాంటి నిర్లక్ష్యం వహించిన కారణంగానే గొలుగొండ మండలం జోగంపేట హాస్టల్లో విద్యార్థి మృత్యువాత పడ్డాడని ఆవేదన వ్యక్తం చేసారు. విద్యార్థికి అపాయం జరిగితే వార్డెన్‌పైనే కాకుండా ఏఎస్‌డబ్ల్యూఓ, డి ఎస్‌డబ్ల్యుఓలు కూడా బాధ్యత వహించాలన్నారు. . ఆయనతోపాటు దళిత సేవా పరిరక్షణ (డి యస్ పి) జిల్లా అధ్యక్షులు యాదగిరి దాసు, మల్లవరపు సతీష్ కుమార్, మండల శాఖ అధ్యక్షులు బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ:మండలంలోని జోగంపేట గ్రామంలో హాస్టల్ విద్యార్థి మృతి చెందిన తర్వాత కూడా అధికారులు కళ్ళు తెరవకపోవడం దారుణమని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎం.అప్పలరాజు ఆరోపించారు. విలేకర్లతో ఆయన మాట్లాడుతూ, మార్చిన భవనంలో కూడా అంగన్వాడీ కేంద్రానికి ప్రైమరీ పాఠశాలకి, ఎస్సీ బాలుర వసతి గృహానికి ఒకే ఒక్క మరుగుదొడ్డి ఉందనే విషయాన్ని ఎందుకు బహిర్గతం చేయలేదని ప్రశ్నించారు. తక్షణమే ప్రత్యామ్నాయ చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు.

వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఇళ్ల స్థలాలివ్వాలని వినతి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మండలంలోని గబ్బాడ గ్రామ పంచాయతీ నిరుపేద దళిత కుటుంబాలకు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని బుధవారం టిడిపి నాయకులు ఆర్డీవో కార్యాలయ ఏఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ దళిత నాయకులు నేతల నాగేశ్వరరావు మాట్లాడుతూ, అర్హులైనప్పటికీ పేద దళితులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయలేదన్నారు. గ్రామంలో క్షేత్ర స్థాయిలో విచారణ చేసి దరఖాస్తు చేసిన అర్హులైన వారందరికి జగనన్న ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి ఈర్లె రాజుబాబు, టిడిపి గ్రామశాఖ అధ్యక్షులు పెట్ల అప్పలనాయుడు, ఉప సర్పంచ్ మాకిరెడ్డి రాజునాయుడు, టీడీపీ ఎస్సీ ప్రధాన కార్యదర్శి కోడి శ్రీనివాసరావు, రెల్లి సంఘం రాష్ట్ర నాయకులు యర్రంశెట్టి పాపారావు, మాలమహానాడు నాయకులు గొతాడ సహదేముడు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న కలెక్టర్

యాంపీ థియేటర్‌ను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : ఆడుదాం - ఆంధ్ర రాష్ట్రస్థాయి క్రీడాపోటీల ముగింపు వేడుకల సందర్భంగా ఈ నెల 13వ తేదీన విశాఖకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి విచ్చేస్తున్న నేపథ్యంలో ఆంధ్రా యూనివర్శిటీలోని కెవి.గోపాలస్వామి యాంపీ థియేటర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పరిశీలించారు. ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో ఏయూ వీసీ కార్యాలయ సమీపంలో ఉన్న ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను ఏయూ వీసీ పీవీజీడీ.ప్రసాద్‌రెడ్డి, రిజిస్ట్రార్ స్టీఫెన్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, పోలీసు ఏడీసీపీ మణికంఠ, ఏడీసీ కెఎస్.విశ్వనాథన్‌లతో కలిసి బుధవారం పరిశీలించారు. అక్కడున్న పరిస్థితులను సమీక్షించారు. ఆడుదాం - ఆంధ్ర ముగింపు వేడుకల సందర్భంగా పీఎం పాలెంలోని ఏసీఏ క్రికెట్ స్టేడియం, ఏయూలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఈ క్రమంలో ఓపెన్ ఎయిర్ థియేటర్లో ఉన్న పరిస్థితులను ఆయన గమనించారు. థియేటర్ సామర్థ్యం, ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలు, సభ ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి కార్యక్రమం నిర్వహించేందుకు థియేటర్ అనువైనదా కాదా అనే అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.

'డిడి పర్యవేక్షణ లేకనే విద్యార్థి మృతి'

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:గొలుగొండ మండలం జోగుంపేట ఎస్సీ హాస్టల్ విద్యార్థి దావీద్ మృతికి జిల్లా సోషల్ వెల్ఫేర్ డిడి పర్యవేక్షణ లోపమే కారణమని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు యర్రంశెట్టి పాపారావు ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో ఎస్సీ వసతి గృహాలను పర్యవేక్షణ చేయలేదన్నారు. ప్రతీ హాస్టల్లో మౌలిక వసతుల పట్ల డిడి ప్రత్యేక శ్రద్ధ సారించాల్సి ఉందన్నారు. భవనాల మరమ్మత్తులు చేయడం, నూతన భవనాలు మంజూరులో డిడి సరైన విధంగా దృష్టి సారించలేదని విమర్శించారు. ప్రభుత్వం నాడు నేడు పథకంలో భాగంగా అనేక భవనాలు మంజూరు చేసినా ఎస్సీ వసతి గృహాలలో మాత్రం చేపట్టలేదన్నారు.

పారా స్విమ్మింగ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-విశాఖపట్నం : విశాఖపట్నం వేదికగా రైల్వే ఆర్ఆర్ ఆక్వా స్విమ్మింగ్ పూల్ నందు ఈ నెల 21 తేదీ నుంచి ప్రారంభం కానున్న 5వ రాష్ట్ర పారా స్విమ్మింగ్ పోటీల పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ పోటీలకు అన్ని జిల్లాల వికలాంగ పారా క్రీడాకారులు పాల్గొని జాతీయ స్థాయి పారా స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపిక అవ్వాలని ఆకాంక్షించారు. ఈ రాష్ట్ర స్థాయి పారా స్విమ్మింగ్ పోటీలలో పాల్గొనే పారా వికలాంగ క్రీడాకారులు 7013569514, 9390131777 నంబర్లను సంప్రదించి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కో ఆర్డినేటర్ వై.శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి రామస్వామి, బ్రహ్మకుమారి సిస్టర్ రామేశ్వరి, జిల్లా వికలాంగుల అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి, జిల్లా ఆమెచూర్ ఆక్వాటిక్ అసోసియేషన్ ట్రెజరర్ రఘునాథరెడ్డి, స్విమ్మింగ్ కోచ్ లక్ష్మణ్, భవేరా గణేష్ టి.ఉదయ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి కౌలురైతు ఆత్మహత్య

ప్రజాశక్తి -పద్మనాభం (విశాఖపట్నం)

వ్యవసాయం కలిసి రాకపోవడంతో పురుగుల మందు తాగి కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. రెడ్డిపల్లి గ్రామంలో కౌలురైతు ఇ.అప్పలరాజు (41) ప్రతి ఏడాది మాదిరిగానే బొప్పాయి పంటను సాగు చేశాడు. అప్పులు చేసి, పెట్టుబడులు పెట్టి బొప్పాయి సాగుచేసినప్పటికీ, ఆశించిన దిగుబడులు, ఆదాయం రాలేదు. చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి, వాటిని తీర్చడమెలాగానే ఆందోళనతో పురుగుల మందు తాగి బొప్పాయి తోటలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య వసంత ఫిర్యాదు మేరకు పద్మనాభం ఎఎస్ఐ నక్క శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించాలి

ప్రజాశక్తి-పాడేరు: మండలాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను తహశీల్దారులు స్వయంగా సందర్శించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. కొత్తగా బదిలీపై వచ్చిన పాడేరు డివిజన్ 11 మండలాల తహశీల్దారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలలో పాల్గొంటున్న అభ్యర్థుల ఖర్చులను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. మీడియాలో ప్రచురిస్తున్న ప్రకటనలు, కరపత్రాలు, గోడ పత్రికలు, ప్రసార మాధ్యమాలలో ప్రకటనలను తప్పని సరిగా పరిశీలించి ఖర్చులను గుర్తించి నమోదు చేయాలని చెప్పారు. నిరంతరం అప్రమత్తంగా ఉండి సజావుగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని స్పష్టం చేసారు. జోనల్, బూత్ స్థాయి అధికారులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావన, ఐటిడిఏ పిఒ అభిషేక్, సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి, ఎన్డీసిలు పి.అంబేద్కర్, వి.వి. ఎస్. శర్మ, తహశీల్దారులు, డిప్యూటీ తహశీల్దారులు పాల్గొన్నారు.